ప్రతి అక్షరం - ప్రజల కోసం

రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 175

బుధవారం 25 డిసెంబర్ 2024 / చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ / HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

MERRY CHRISTMAS
క్రిస్మస్
శుభాకాంక్షలు

ప్రశ్నలకు బన్నీ సైలెంట్

ఘటన జరిగిన సమయంలో స్పాట్‌లోనే ఉండడంతో రమేష్ కుమార్ ఈ విచారణలో కీలకంగా మారారు. అసలు ఈ రోజు థియేటర్‌లో ఏం జరిగిందో ఆదివారం ఆయన కళ్లకు కట్టినట్టు వివరించారు.

హైదరాబాద్ - రోమింగ్ న్యూస్

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో సినీ నటుడు అల్లు అర్జున్ విచారణ ముగిసింది. మంగళవారం ఉదయం 11 గంటలకు తన తండ్రి అల్లు అరవింద్‌తో కలిసి అల్లు అర్జున్ చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. అల్లు అర్జున్ లాయర్, మామ చంద్రశేఖర్ రెడ్డి, బన్నీ వాసు కూడా చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఆ విచారణలో అల్లు అర్జున్‌ను మధ్యాహ్నం 2.47 గంటల వరకు విచారించారు. ఈ విచారణలో ఏసీపీ రమేష్ కుమార్ కీలకంగా వ్యవహరించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన జరిగినపుడు రమేష్ కుమార్ కుమార్ అక్కడే ఉన్నారు.చిక్కడపల్లి డివిజన్‌కు సంబంధించి ఎల్ రమేష్ కుమార్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్.

2లో

ఎలాంటి ప్రలోభాలు లేకుండా

ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

ఖమ్మం:- రోమింగ్ న్యూస్

తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం హౌసింగ్ డిపార్ట్ మెంట్‌ను పూర్తిగా పక్కకు పెట్టిందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తప్పులు దొర్లకుండా నిజమైన ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేయటమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. జిల్లాకో స్పెషల్ ఆఫీసర్‌ను నియమించామని గుర్తుచేశారు. మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇళ్లు ఇస్తామని వివరించారు. ఇవాళ(మంగళవారం) ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలంగాణ సచివాలయంలో అధికారులతో కీలక భేటీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక సర్వేపై అధికారులతో చర్చించి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో 33 జిల్లాల నుంచి ప్రాజెక్ట్ డైరెక్టర్లు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 19,000 మంది సిబ్బందితో యాప్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ప్రజా పాలనలో

భారతమాత కన్న

తెలంగాణ ముద్దుబిడ్డ..

శ్యామ్ బెనెగల్: కేసీఆర్

హైదరాబాద్ - రోమింగ్ న్యూస్

భారతీయ సినిమా దర్శక దిగ్గజం, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత పద్మ భూషణ్ శ్యామ్ బెనగల్ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. విస్మరించబడిన మనుషుల సామాజిక నేపథ్యాలకు సినీమా రంగంలో సమాంతర స్థానం కల్పించి, సామాన్యుల జీవన ఇతివృత్తాలకు వెండితెర గౌరవం కల్పించిన గొప్ప దర్శకుడని, భరత మాత కన్న తెలంగాణ ముద్దు బిడ్డ శ్యామ్ బెనగల్ (బెనగల్ల శ్యామ్ సుందర్ రావు) అని కొనియాడారు.ఇటు తెలంగాణ జీవన నేపథ్యాన్ని, అటు దేశీయ సామాజిక సంస్కృతిక వైవిధ్యాన్ని ఇరుసుగా

ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్..
ఆర్థిక నిపుణులతో ప్రధాని భేటీ..!

హైదరాబాద్ - రోమింగ్ న్యూస్

వచ్చే ఏడాది పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనున్నది. బడ్జెట్‌కు సంబంధించి అభిప్రాయాలు, సూచనలను స్వీకరించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థికవేత్తలు, నిపుణులతో సమావేశమయ్యారు. ఫిబ్రవరి 1న లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెడుతారు. ఈ సమావేశంలో సీతారామన్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీ, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్, సుర్జిత్ భల్లా, డీకే జోషి సహా ప్రముఖ ఆర్థికవేత్తలు సమావేశానికి హాజరయ్యారు.ఇదిలా ఉండగా భారతదేశ 2024-25 ఆర్థిక వృద్ధి మందగమనం నేపథ్యంలో ప్రధాని సమావేశం నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ త్రైమాసికంలో భారత ఆర్థిక వృద్ధి 5.4 శాతానికి పడిపోయింది. దాదాపు రెండేళ్ల కనిష్ఠానికి చేరింది. ఆర్‌బీఐ, రేటింగ్ ఏజెన్సీల అంచనాల కంటే ఘోరంగా తగ్గింది. గతేడాది ఇదే త్రైమాసికంలో జిడిపి ఏకంగా 8.1 శాతం పెరుగుదల చోటుచేసుకుంది. గడిచిన ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 6.7 శాతానికి పరిమితమైంది. ఈ రెండింటితోనూ పోల్చినా జీడీపీ భారీ తగ్గుదల నమోదవడం ఆందోళన కలిగిస్తున్నది. మరోవైపు రేటింగ్ ఏజెన్సీలు కూడా 6శాతం ఎగువన వృద్ధి ఉండొచ్చని అంచనా వేయగా.. వాటి కంటే తక్కువగా పడిపోవడం గమనార్హం.జీడీపీ 7శాతం పెరుగుతుందని రిజర్వ్ బ్యాంక్ అంచనా వేయగా.. అంచనాలకు మంచి జీడీపీ పతనమైంది. రాబోయే బడ్జెట్‌లో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రోత్సాహకాలు ప్రకటిస్తుందా? లేదంటే సంస్కరణలు తీసుకువస్తుందా? అనేది ఆసక్తి నెలకొన్నది. జనవరి 20న అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇటీవల ట్రంప్ భారత్, చైనా, బ్రెజిల్ సహా ఇతర దేశాల వస్తువులపై సుంకాలను పెంచనున్నట్లు హెచ్చరించారు. మరో వైపు ఈ నెల 20న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో ఆర్థిక మంత్రి ప్రీ-బడ్జెట్ సమావేశం నిర్వహించారు. పంజాబ్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చెందిన ఆర్థిక మంత్రులు కేంద్రం నుంచి ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. దీర్ఘకాలిక మౌలిక సదుపాయాలు, మూల ధనం వ్యయం కోసం 50 సంవత్సరాల వడ్డీ లేని రుణాల కేటాయింపును పెంచాలని కేంద్రాన్ని కోరారు.

రాబోయే మూడు రోజుల్లో హైదరాబాద్‌కు వర్ష సూచన..!

హైదరాబాద్ - రోమింగ్ న్యూస్

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో రాబోయే మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హైదరాబాద్ కేంద్రం తెలిపింది. పలు ప్రాంతాల్లో చిరుజల్లులు, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. పలు జిల్లాల్లో కూడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.ఈ మూడు రోజుల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందని, చిరుజల్లులు కూడా ఉదయం వేళనే కురిసే అవకాశం ఉందన్నారు. రాబోయే మూడు రోజుల్లో 20 నుంచి 40 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉంది. ఆదిలాబాద్ మినహా, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల సెల్సియస్ నుంచి 20 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉంది.

ప్రయాణికులకు అలర్ట్..

హైదరాబాద్ - రోమింగ్ న్యూస్

సికింద్రాబాద్‌కు చేరాల్సిన కృష్ణా ఎక్స్ ప్రెస్ రైలు ఈరోజు ఇంకా రాలేదు. దీంతో ఈ ట్రైన్ కోసం చూస్తున్న ప్రయాణికులు అలాగే వేచి చూస్తున్నారు. అయితే ఈ ట్రైన్ ఆరు గంటల ఆలస్యంగా నడుస్తుందని అధికారులు తెలిపారు. ఈ రైలు తిరుపతి నుంచి సికింద్రాబాద్ మీదుగా ఆదిలాబాద్‌కి వెళ్లాల్సి ఉంది. రైల్వే ట్రాక్‌పై పలు మార్పుల కారణంగా రైలు ఆలస్యం అవుతుందని అధికారులు ప్రకటించారు. దీంతో ఈ ట్రైన్ కోసం వచ్చి టిక్కెట్లను తీసుకున్న ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.%ఇతర ట్రైన్లు కూడా ఆలస్యం..రైలు సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు ఎటు వెళ్ళాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. కొంతమంది

TIRUPATI
ADILABAD
H.S.NANDED

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
25 డిసెంబర్ 2024

నక్షత్ కుమారుడి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రవీందర్

నకిరేకల్, రోమింగ్ న్యూస్:
తాటికల్ రోడ్డు ఎస్సీ కాలనీ యూత్ కాంగ్రెస్ నాయకులు వంటేపాక నక్షత్ కుమారుడి మొదటి జన్మదిన వేడుకలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు మామిడికాయల నాగయ్య, వంటేపాక యాదగిరి, పందిరి సతీష్, చనగోని రాజశేఖర్, వంటేపాక సతీష్ ,చెరుపల్లి సైదులు, నల్గొండ మహేష్, దైద సురేష్, వంటేపాక జానీ, చనగోని నాగరాజు, నకిరేకంటి మధు, బట్టు చరణ్, సాయి, వినయ్, అర్జున్, శేఖర్, మురళి, నవీన్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు అలర్ట్..

మొదటిపేజి తరువాయి
రైలు ఆలస్యానికి సంబంధించిన సమాచారం కోసం అధికారులను సంప్రదించారు. అధికారులు ఈ ఆలస్యం గురించి వివరించారు. రైల్వే ట్రాక్ పనుల కారణంగా ప్రస్తుత సమయంలో పలు మార్పులు అవసరం అవుతున్నాయని చెప్పారు. అందువల్ల సమయానికి కృష్ణా ఎక్స్ ప్రెస్ రైలు రావడం కష్టం అయ్యిందన్నారు. అధికారులు ప్రస్తుత పరిస్థితిని చెక్ చేస్తూ, రైలు త్వరగా ప్రారంభం అవుతుందని చెబుతున్నారు. ఈ క్రమంలో రైల్వే అధికారులు ప్రస్తుత పరిస్థితిని త్వరగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు.?

సంధ్య థియేటర్ ఘటనపై అల్లు అర్జున్‌కు ప్రశ్నలు..

మొదటిపేజి తరువాయి
చిక్కడపల్లి పోలీస్ స్టేషన్, ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ రమేష్ కుమార్ పరిధిలోకి వస్తాయి. ఘటన జరిగిన సమయంలో స్పాట్‌లోనే ఉండడంతో రమేష్ కుమార్ ఈ విచారణలో కీలకంగా మారారు. అసలు ఈ రోజు థియేటర్‌లో ఏం జరిగిందో ఆదివారం ఆయన కళ్లకు కట్టినట్టు వివరించారు. ఘటన జరిగిన రోజు తామంతా సంధ్య థియేటర్ దగ్గరే ఉన్నామని, రేవతి చనిపోయిన విషయం అల్లు అర్జున్‌కు చెప్పడానికి వెళితే అతడి మేనేజర్ అడ్డుకున్నాడని తెలిపారు.సీపీ ఆదేశాల మేరకు తాను అల్లు అర్జున్ దగ్గరకు కష్టపడి చేరుకుని విషయం చెప్పానని, ఇంటికి వెళ్లిపోవాల్సిందిగా విజ్ఞప్తి చేశానని, అయితే సినిమా పూర్తయిన తర్వాతే వెళ్తానని అల్లు అర్జున్ తనకు చెప్పారని ప్రెస్‌మీట్‌లో రమేష్ వెల్లడించారు. ఈ రోజు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో విచారణ సందర్భంగా అల్లు అర్జున్‌ను 20 ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. సేకరించిన వీడియోలు, సిసి ఫుటేజ్‌ను ముందు పెట్టి అల్లు అర్జున్‌ను విచారించినట్టు తెలుస్తోంది. మూడున్నర గంటల పాటు అల్లు అర్జున్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు పోలీసులు. అవసరమైతే మరోసారి నోటీసులు ఇస్తామని పోలీసులు తెలిపారు. మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని.. అందుబాటులో ఉండాలని అల్లు అర్జున్‌కు పోలీసులు తెలిపారు.

భారతమాత కన్న తెలంగాణ ముద్దుబిడ్డ..

మొదటిపేజి తరువాయి
రూపంలో వారందించిన సేవలను ఈ సందర్భంగా కేసీఆర్ స్మరించుకున్నారు. హైదరాబాద్ గడ్డ మీద పుట్టిన బిడ్డగా చలన చిత్ర రంగంలో తన కృషితో ప్రతిష్టాత్మక అవార్డులు సాధించి, భారతీయ సినిమాకు వన్నె తెచ్చిన శ్యామ్ బెనెగల్ తెలంగాణకు గర్వకారణం అని అన్నారు.దర్శక దిగ్గజం శ్యామ్ బెనెగల్ సోమవారం కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న 90 సంవత్సరాల శ్యామ్ బెనెగల్ సోమవారం సాయంత్రం ముంబైలోని వోడ్‌హార్డ్ దవాఖానలో తుది శ్వాస విడిచినట్టు ఆయన కుమార్తె పియా బెనెగల్ ధ్రువీకరించారు. ఆయనకు భార్య నీనా బెనెగల్, కుమార్తె ఉన్నారు. అంకుర్, భూమిక, జునూన్, కలియుగ్, ఆరోహన్, త్రికాల్, సుస్మాన్, అంతర్‌నాద్, మండి, మంథన్ తదితర అనేక అవార్డు చిత్రాలకు శ్యామ్ బెనెగల్ దర్శకత్వం వహించారు. 1978లో వాణిశ్రీ, అనంతనాగ్‌లతో ఆయన తీసిన ఏకైక తెలుగు చిత్రం అనుగ్రహం 1979 బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు నోచుకుని విమర్శకుల ప్రశంసలు అందుకుంది. డిసెంబర్ 14న ఆయన మిత్రులు, కుటుంబ సభ్యులతో కలసి తన 90వ పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. 1976లో పద్మశ్రీ అవార్డు, 1991లో పద్మ భూషణ్ అవార్డుతో భారత ప్రభుత్వం ఆయనను గౌరవించింది. ఆయన దర్శకత్వం వహించిన విజయవంతమైన చిత్రాలలో మంథన్, జుబేదా, సర్దారీ బేగం కూడా ఉన్నాయి.జవహర్‌లాల్ నెహ్రూ రచించిన డిస్కవరీ ఆఫ్ ఇండియా ఆధారంగా దూరదర్శన్ కోసం ఆయన రూపొందించిన భారత్ ఏక్ ఖోజ్ డాక్యుమెంటరీ దేశవ్యాప్తంగా ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. 1934 డిసెంబర్ 14న హైదరాబాద్‌లో జన్మించిన శ్యామ్ బెనెగల్ కొంకణీ మాట్లాడే చిత్రపూర్ సారస్వత్ బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారు. కర్ణాటకకు చెందిన శ్యామ్ బెనెగల్ తండ్రి శ్రీధర్ బీ బెనెగల్ ఫొటోగ్రాఫర్ కావడంతో కెమెరా పట్ల శ్యామ్‌కు చిన్నప్పటి నుంచే ఆసక్తి ఏర్పడింది.

ఎలాంటి ప్రలోభాలు లేకుండా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

మొదటిపేజి తరువాయి
ఇందిరమ్మ ఇండ్ల కోసం 80 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని గుర్తుచేశారు. దరఖాస్తుల ఆధారంగా ఇంటింటికీ వెళ్లి సర్వే పూర్తి చేసినట్లు వివరించారు. నిన్నటి వరకు 30 లక్షల పైచిలుకు అప్లికేషన్ల సర్వే పూర్తి అయినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.ఈసందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... 80 లక్షల మంది ఇందిరమ్మఇళ్ల కోసం దరఖాస్తు పెట్టుకున్నారని చెప్పారు. ఇందిరమ్మ యాప్‌ను ఏర్పాటు చేసి లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిధులను కూడా వినియోగిస్తామని అన్నారు. ఇందిరమ్మఇళ్ల కోసం ప్రత్యేక డిజైన్ అంటూ ప్రభుత్వం ఏం నిర్ణయించలేదని చెప్పారు. ఎవరికి ఇష్టం వచ్చినట్టుగా వారు నిర్మించుకోవచ్చని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లపై ప్రభుత్వం ఒక్క అడుగు వెనక్కి వేయదని తెలిపారు. ఎలాంటి ప్రలోభాలు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఉండొద్దని చెప్పారు.

బడ్జెట్ ప్రైవేట్ స్కూల్స్‌ను ఫీజు నియంత్రణ నుంచి మినహాయించాలి

ట్రస్మా కేర్ టేకింగ్ ప్రెసిడెంట్ సాదుల మధుసూదన్ -విద్యా కమిషన్ చైర్మన్ మురళి ఆధ్వర్యంలో జరిగిన సమావేశం

హైదరాబాద్, రోమింగ్ న్యూస్:
వార్షికంగా 50 వేల రూపాయల కంటే తక్కువ ఫీజు కలిగిన బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలను ఫీజు నియంత్రణ నుంచి మినహాయించాలని ట్రస్మా కేర్ టేకింగ్ ప్రెసిడెంట్ సాదుల మధుసూదన్ విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ స్కూల్స్ లో విద్యా పరిస్థితుల చర్చించేందుకు విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఆధ్వర్యంలో సభ్యులు జ్యోత్స్న, డాక్టర్ విశ్వేశ్వర రావు లతో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సాదుల మధుసూదన్ మాట్లాడారు. బడ్జెట్ ప్రైవేట్ స్కూల్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన వివరణాత్మకమైనటువంటి సూచనలు చేశారు. ఫీజుల వసూలు మొదలు అర్హత కలిగిన ఉపాధ్యాయుల కొరత... నిర్బంధ నిర్బంధనలు.. తదితర అంశాలపై ఆయన వారి దృష్టికి తీసుకువచ్చారు. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలను ఆదరించి వారిలో విద్యా వికాసం కలిగిస్తున్న బడ్జెట్ ప్రైవేట్ స్కూల్స్ గ్రామీణ, పట్టణాల్లోని బస్తీలలో చేస్తున్న కృషిని ఆయన వివరించారు. నిబంధనల విషయంలో బడ్జెట్ ప్రైవేట్ స్కూల్స్ ను కార్పొరేట్ పాఠశాలల నుంచి విడదీయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సిబిఎస్ఈ .. ఇతర వ్యాపార దృష్టితో ఏర్పాటు చేసిన కార్పొరేట్ స్కూల్స్ ఫీజు లపై నియంత్రణ ఉండాలని ఆయన సూచించారు. బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలను ప్రోత్సహించే రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులకు నిరంతర ప్రొఫెషనల్ డెవలప్మెంట్ శిక్షణల కల్పన కోసం ప్రత్యేక కృషి జరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. సైన్స్, కంప్యూటర్, రోబోటిక్స్ లైబ్రరీ వంటి ల్యాబ్ లను పాఠశాలలలో అప్డేట్ చేసేందుకు తక్కువ వడ్డీకి రుణాలను ఇవ్వాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. దీనివల్ల నాణ్యమైన విద్య అందడంతో పాటు విద్యా విధానంలో వస్తున్న అధునాతన టెక్నాలజీని సాధారణ పేద బడుగు బలహీన వర్గాల పిల్లలు అందుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. ఫీజు వసూలు హక్కును విద్యా విధానంలో చేర్చడం అవసరమని ఆయన చెప్పారు. రాష్ట్రంలో అత్యధికంగా ఫీజులు వసూలు చేసే పాఠశాలలు 1100 వరకు ఉంటాయని ఆ నిబంధనలను సాధారణ బడ్జెట్ స్కూల్స్కు వర్తింపజేయడం వల్ల అన్యాయం జరుగుతుందని చెప్పారు. ఎన్ఓసీల పేరుతో జరుగుతున్న దోపిడీ గురించి కూడా ఆయన వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఉమామహేశ్వరరావు, పల్లె వినయ్ కుమార్ గౌడ్, కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, వీ. శ్రీనివాస్ గౌడ్, జీతూ ప్రసాద్, దయాకర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వీరితోపాటు తెలంగాణలోని 33 జిల్లాల నుంచి విచ్చేసిన ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ సభ్యులు, విద్యావేత్తలతో ఈ సమావేశం జరిగింది.మంగళవారం విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు జ్యోత్స్న, డాక్టర్ విశ్వేశ్వర రావు డైరెక్ట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్పోరేట్ పాఠశాలల జాబితా.

బీఆర్ఎస్ అనాలోచిత నిర్ణయంతో రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తం

– పూర్వ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, కార్యదర్శి బాలకృష్ణ సీఎం రేవంత్ కు కృతజ్ఞత చెప్తూ యాదగిరిగుట్టలో వీఆర్వోల పూజలు

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:
బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచితంగా వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడంతో.. రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని 'పూర్వ గ్రామ రెవెన్యూ అధికారుల(వీఆర్వోలు) సంక్షేమ సంఘం' జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ పేర్కొన్నారు. వీఆర్వోలను తిరిగి రెవెన్యూ డిపార్ట్మెంట్ లోకి తీసుకుంటామనే సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని హర్షిస్తూ.. మంగళవారం యాదగిరిగుట్టలో వైకుంఠ ద్వారం వద్ద పూర్వ వీఆర్వోలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారసింహుడి పాదాల వద్ద కొబ్బరికాయలు కొట్టి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అక్కడే కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాల కారణంగా కుంటుపడిన రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడం కోసం.. గతంలో పనిచేసిన వీఆర్వోలను తిరిగి రెవెన్యూ డిపార్ట్మెంట్ లోకి తీసుకుంటామని అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల సంతోషంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడంతో గ్రామాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. గతంలో గ్రామాల్లో వీఆర్వోలు, వీఆర్ఏలుగా పని చేసిన అందరిని తిరిగి రెవెన్యూలోకి తీసుకోవడానికి ఆప్షన్ కల్పించిన ప్రభుత్వానికి ఎప్పటికీ కృతజ్ఞులమై ఉంటామన్నారు. తమను తిరిగి రెవెన్యూ డిపార్ట్మెంట్ లోకి తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు గతంలో వినతిపత్రం ఇచ్చినప్పుడు కచ్చితంగా అసెంబ్లీలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారని.. హామీని నిలబెట్టుకుంటూ వీఆర్వోలను రెవెన్యూ డిపార్ట్మెంట్ లోకి తీసుకోవాలని అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి వీఆర్వోలను తిరిగి రెవెన్యూలోకి తీసుకోవడానికి సహకరించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ధన్యవాదాలు చెప్తున్నామని తెలిపారు. అలాగే వీఆర్వోలను రెవెన్యూలోకి తీసుకునేలా కృషి చేసిన జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు గరిక ఉపేందర్ కు ధన్యవాదాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పూర్వ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట నరసింహారెడ్డి, వీఆర్ఏల సంఘం రాష్ట్ర నాయకురాలు రెడ్డి ఝాన్సీ రాణి, కవిత, మండల నాయకులు కృష్ణ, నరసింహ, సురేష్, ఎస్కే అహమ్మద్, యాదగిరి, అజ్మత్ పాషా, ఇస్తారి, నరసింహ, శంకర్, పద్మ, శిరీష, మాధవరెడ్డి, శంకర్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

– అడిషనల్ కలెక్టర్ గంగాధర్

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేయాలని యాదాద్రి జిల్లా అడిషనల్ కలెక్టర్ గంగాధర్ అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట మండలం దాతరుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లగుడిసెలులో ఆఫీసర్లు చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరుతెన్నులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అప్లికేంట్ల నుండి వివరాలు సేకరించడంలో జాగ్రత్త వహించాలని, తప్పులు దొర్లకుండా ఎంట్రీ చేయాలని సూచించారు. సర్వే సమయంలో దరఖాస్తుదారులు ఇంటి వద్ద లేకుండా.. ఫోన్ చేసి రప్పించుకుని వివరాలు సేకరించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు సర్వే పూర్తి చేయాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సలీం, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

ప్రజావాణి చొరవతో

ఆర్టీసీ త్రిసభ్య కమిటీ ఏర్పాటు

ప్రజా భవన్ లో బాధిత ఆర్టీసీ కార్మికుల విజయోత్సవాలు

సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, చిన్నారెడ్డి, దివ్యలకు ధన్యవాదాలు తెలిపిన బాధిత ఆర్టీసీ కార్మికులు

హైదరాబాదు, రోమింగ్ న్యూస్:

ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమం చొరవ వల్ల ఆర్టీసీలో త్రిసభ్య కమిటీ ఏర్పాటు కావడం పట్ల బాధిత ఆర్టీసీ కార్మికులు మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో విజయోత్సవాలు నిర్వహించారు. మంగళవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్లో దాదాపు 500 మంది బాధిత ఆర్టీసీ కార్మికులు తరలివచ్చి సంబరాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రజావాణి ఇంచార్జీ డాక్టర్ జీ చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యలకు బాధిత ఆర్టీసీ కార్మికులు ధన్యవాదాలు తెలిపారు.మొబైల్ ఫోన్ లో మాట్లాడుతున్నారని, బస్ స్టాప్ లో బస్సు ఆపలేదని, విధులు సరిగా నిర్వహించలేదని వంటి చిన్న చిన్న కారణాలను సాకుగా చూపి తమను ఉద్యోగాల నుంచి తొలగించడాన్ని బాధిత ఆర్టీసీ కార్మికులు సీఎం ప్రజావాణిలో రెండు నెలల కిందట గోడును వెళ్ళబుచ్చుకున్నారు. వారి సమస్యలను ప్రజావాణి ఇంచార్జీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకుని వెళ్లారు.ఉద్యోగాల నుంచి తొలగించబడిన ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఇటీవల ఏర్పాటు చేసింది. తమ ఉద్యోగాలను సత్వరమే ఇప్పించాలని , ఈ మేరకు త్రిసభ్య కమిటీ కృషి చేయాలని బాధిత ఆర్టీసీ కార్మికుల ప్రతినిధులు దుగ్గు రాజేందర్, సుంకరి బాగేశ్వర్, కుమ్మరి గంగాధర్, చెరుకు భూమేష్, చెక్క సంపత్, వై. ప్రకాష్, ఎలమర్తి ప్రసాద్ రావు విజ్ఞప్తి చేశారు.ప్రజావాణిలో 370 దరఖాస్తులు..మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో మంగళవారం జరిగిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో 370 దరఖాస్తులు అందాయి.ప్రజావాణి ఇన్చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 107 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు 80, రెవెన్యూ శాఖకు 65, ప్రవాసి ప్రజావాణికి 4, ఇతర శాఖలకు 114 దరఖాస్తులు అందాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం, రేషన్ కార్డులు, పెన్షన్ల కోసం ఎక్కువగా దరఖాస్తులు అందాయి.

మహాత్మా జ్యోతి రావ్ పూలే ప్ర
MA JYOTHIRAO PHULE PRAJA BHAVAN ★ महात्मा ज्योतिराव फुले प्रजा भवन ★

నో డిటెన్షన్ విధానము రద్దు చేస్తే పేదలు

విద్యకు దూరమయ్యే ప్రమాదం

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడున్న విధానాన్నే కొనసాగించాలి

బాలల హక్కుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి

పాఠశాల విద్యకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. నో డిటెన్షన్ విధానం ప్రకారం ఒకటి నుంచి 8 తరగతి వరకు విద్యార్థులను ఫెయిల్ చేయడం కానీ స్కూల్ నుంచి బహిష్కరించండి గానీ చేయకూడదు. ఇదే ఇప్పటి వరకు కొనసాగుతున్న నాన్ డిటెన్షన్ విధానం. వారు ప్రాథమిక విద్య అనగా ఒకటి నుండి 8 తరగతుల వరకు పూర్తి చేసుకునే వరకు ఆటోమేటిగ్గా పై తరగతులకు ప్రమోట్ చేయబడతారు. వీరికి పరీక్షలు నిర్వహించినప్పటికీ గ్రేడ్స్ ఇచ్చి పై తరగతికి ప్రమోట్ చేస్తారు. ఎవరిని ఫెయిల్ చేయరు. ఇదే నో డిటెన్షన్ పాలసీ. ఇప్పుడు నో డిటెన్షన్ పాలసీని మార్పులు చేస్తూ కేంద్ర ప్రభుత్వం 5, 8 తరగతులకు పరీక్షలు నిర్వహించాలని వారు పరీక్షల్లో ఉత్తీర్ణులు కానిచో వారికి తిరిగి రెండు నెలలలో మళ్ళీ పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణు అయితేనే పైతరగతులకు పంపబడతారని ఉత్తీర్ణులు కాని వారు అదే తరగతిలో తిరిగి చదవాల్సి ఉంటుందని సోమవారము నాడు ఒక గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ఉత్తర్వులు విడుదల చేయడం జరిగింది. అయితే విద్య రాష్ట్రాల పరిధిలోని(ఉమ్మడి జాబితా) అంశమైనందున గెజిట్ను అనుసరించి రాష్ట్రాలు ఈ విషయంలో తగు చర్యలు తీసుకోవచ్చని కేంద్రం తెలిపింది. పాఠశాల విద్య రాష్ట్ర జాబితాలోని అంశము కనుక నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేసే విషయంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలకు నిర్ణయం తీసుకునే వెసూలుబాటు కేంద్ర ప్రభుత్వం కల్పించింది. ఇప్పటి వరకువిద్యా హక్కు చట్టం - 2009, సెక్షన్ 16 ప్రకారము బడిలో ప్రవేశం పొందిన బాలలను ఎలిమెంటరీ విద్యా పూర్తయ్యే వరకు బడి నుంచి తొలగించకూడదు. అదేవిధంగా సెక్షన్ 30 ప్రకారము ఎలిమెంటరీ విద్యా పూర్తయ్యే వరకు పిల్లలు ఎలాంటి బోర్డు పరీక్షలు రాయాల్సిన అవసరం లేదు. ఐతే కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నో డిటెన్షన్ రద్దు విధానాన్ని రాష్ట్రంలో గనుక అమలుపరిస్తే పాఠశాల విద్యలో డ్రాప్ అసౌట్స్ మరింతగా పెరిగే అవకాశం ఉందని తద్వారా పేదవారు విద్యకు మరింత దూరం అయ్యే ప్రమాదం ఉందని బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ అన్నారు. ఇప్పటి వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో నాన్ డిటెన్షన్ విధానమే కొనసాగుతున్నది. కేంద్ర యాజమాన్యంలోని కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, సైనిక్ స్కూల్స్ లాంటి దాదాపు 3000 ల స్కూల్స్ కు మాత్రమే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ నో డిటెన్షన్ రద్దు విధానము వర్తించనున్నది. విద్యాహక్కుచట్టం-2009 కు 2019 లో చేసిన సవర ణల ప్రకారం.. దాదాపు 16 రాష్ట్రాలు, ఢిల్లీ సహా రెండు యూటీలు 5, 8వ తరగతులకు ఇప్పటికే నో-డిటెన్షన్ విధానాన్ని రద్దు చేశాయి. తాజాగా కేంద్రం కూడా ఇప్పుడు ఈ విధానాన్ని రద్దు చేసింది. దాంతో కేద్ర ప్రభుత్వ యాజమాన్యంలో నడిచే కేంద్రీయ విద్యాలయాలు లాంటి విద్యా సంస్థల్లో ఇక నుండి ఈ నో డిటెన్షన్ విధానం రద్దు కానున్నది. కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చున ఈ "నో డిటెన్షన్ విధానం రద్దు" అనే నూతన విద్యా విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయవద్దని ఇప్పుడున్న విధానాన్నే కొనసాగించాలనీ బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి ట్విట్టర్ ద్వారా విజ్ఞాపన పత్రము పంపడం జరిగిందని ఇంజమూరి రఘునందన్ తెలిపారు.

ఇంజమూరి రఘునందన్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
బాలల హక్కుల సంక్షేమ సంఘం

యాసంగి పంటకు సర్వం సిద్ధం చేయాలి

యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి, రోమింగ్ న్యూస్:

రుణమాఫీ, రైతు బీమా, పీఎం కిసాన్, విత్తనాలు,ఎరువులు, పురుగుల మందు పై జిల్లా వ్యవసాయ అధికారులతో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు మంగళవారం రోజు మినీ మీటింగ్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే యాసంగి పంట కోసం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికలను రూపొందించాలని కోరారు. రైతులకు ఎరువులను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రైతులకు ఎరువుల కోసం ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన రైతులకు రుణమాఫీ వర్తించేలా చూడాలన్నారు. చనిపోయిన రైతు కుటుంబాల వారికీ రైతు బీమా డబ్బులు తొందరగా అందేలా చూడాలన్నారు. పీఎం కిసాన్ క్రింద రైతులకు వచ్చే డబ్బులను ఎలాంటి ఆటంకం లేకుండా ఈ కేవైసీ, ఆధార్ సీడింగ్ చేయించాలన్నారు. పీఎం కిసాన్ అర్హులైన రైతులకు మాత్రమే వర్తించేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, ఏడిఓ నీలిమ, ఎంఏఓఎస్ లు, ఏడీఓఎస్ లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బీబీనగర్లో 15 రోజులుగా తెరుచుకోని ఎంఈఓ కార్యాలయం

మండల వనరుల (విద్యా) కేంద్రము

బీబీనగర్, రోమింగ్ న్యూస్:

బీబీనగర్ మండలంలో ని మండల విద్యాధికారి కార్యాలయం గత 15 రోజుల నుండి తెరుచుకోవడం లేదనీ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కోశాధికారిబానోతు శ్రవణ్ కుమార్ మంగళవారం తెలిపారు.పాఠశాలలకు వచ్చే మధ్యాహ్న భోజన బిల్లులు, ఎం. డి. ఎం రైస్,పాఠశాల మానిటరింగ్ ఇతర ఆన్లైన్ పనులు అన్ని పెండింగ్ లో ఉన్నాయి.ఈ కార్యాలయంలో (సమగ్ర శిక్ష) కింద విధులు నిర్వహిస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్ ,సీఆర్పీలు, ఐఆర్పిలు పీటీఐ లు మెసెంజర్ వివిధ రకాల ఉద్యోగులు గత 20 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ విధానంలో చాలి చాలని వేతనంతో విధులు నిర్వహిస్తున్నారు.కావున ఈ ఎస్ ఎస్ ఏ ఉద్యోగులు గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎన్నికల ముందు 28 రోజులు సమ్మె చేయడం జరిగింది. సమ్మె సమయంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ పీసీసీ హోదాలో ఉన్న ఇప్పటి గౌరవ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి గారు హనుమకొండ వేదిక దగ్గర వచ్చి మా సమ్మెకు మద్దతు తెలిపి వారు వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ గవర్నమెంట్ వస్తే 100 రోజులలో మిమ్మల్ని దర్జాగా నా కార్యాలయానికి పిలిచి మీతో చర్చించి చాయ్ తాగే లోపల జీవో ఇప్పిస్తా అని హామీ ఇవ్వడం జరిగింది. ఇచ్చిన హామీ 100 రోజులు పోయింది సంవత్సరం కూడా గడిచింది అయినా ఇప్పటికీ హామీని నెరవేర్చలేదు.కావున సమస్య పరిష్కరించే వరకు మరియు జీవో వచ్చే వరకు ఈ సమ్మెను ఆపబోమని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నాము. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కోశాధికారి బానోతు శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు.

భారత జాతీయ ఆత్మ అటల్ జీ



(భారత రత్న' అటల్ బిహారీ వాజపేయి గారి శతజయంతిసందర్భంగా)

" అటల్ జీ తమ ప్రసంగాలలో సునిషిత హాస్యాన్ని కురిపించేవారు. ఎంతో గంభీరమైన వాతావరణంలో అయినా హాస్యపు జల్లులు కురిపించి, శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేసేవారు. 1982లో నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ "శ్రమ యేవ జయతే" అని పిలుపునివ్వగా, అటల్ జీ "భ్రమ యేవ జయతే" అంటూ ఎద్దేవా చేశారు. తమ సునిషిత హాస్యక్తులతో అప్పుడప్పుడు ప్రభుత్వాలను సైతం ఇరకాటంలో పెట్టి తాను ఆనందిస్తూ.. ప్రజలను కూడా ఆనందింప చేసేవారు. రౌండ్ టేబుల్ సమావేశంలో జాతీయ భాష అయిన హిందీలో ప్రసంగించి ప్రపంచ నేతల ప్రశంసలనందిన మహాత్మునిలా 1977లో విదేశాంగ మంత్రిగా శ్రీ అటల్ జీ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో భారత దేశ జాతీయ భాష హిందీలో అనర్గళంగా ప్రసంగించి, ప్రపంచ నేతలు అందరిని ఆకట్టుకొని భారత కీర్తిని ఖండ ఖండాంతరాల వరకు విస్తరింపజేశారు. 1995లో జెనీవాలో జరిగిన మానవ హక్కుల అంతర్జాతీయ సదస్సులో భారత బృందానికి నాయకత్వం వహించి తమ వాక్కు సమయమనంతో ప్రపంచ నేతలందరినీ ఆకట్టుకుని, మతోన్మాదంతో మతిభ్రమించిన పాకిస్తాన్ ను ఏకాకిని చేసి దాని దుష్టపన్నాగాన్ని కాలరాచి, ప్రపంచ వీధుల్లో భారత్ విజయ పతాకాన్ని ఎగరవేసిన భారతి రస పుత్రుడు మన అటల్ జీ అటల్ జీ అంటేనే భారత జాతీయ ఆత్మ. "

ఇంతింతై వటువింతై...అన్న చందాన... భారతావని నడిబొడ్డున గల మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్ సంస్థానంలో 1926 డిసెంబర్ 25 న అటల్ జీ జన్మించారు. బాల్యం నుంచే వారు తనదైన శైలిలో అందరినీ ఆకట్టుకొని అందరిలో తలలోని నాల్కలా.... వ్యవహరించేవారు. బాల్యంలో కమ్యూనిస్టు భావాలు కలిగి ఉండి భారత కమ్యూనిస్టు పార్టీకి అనుబంధమైన ఏఐఎస్ఎఫ్ లో పనిచేశారు. కాని 1948లో దేశ విభజన వేళ కమ్యూనిస్టులు ప్రదర్శించిన ద్రోహబుద్ధికి కలత చెంది, తన 15 ఏట వ్యక్తి నిర్మాణం ద్వారా దేశోద్ధరణ అనే పవిత్ర లక్ష్యాన్ని చేపట్టి జాతీయ భావాలకు గని వంటిదైన పరమపూజ్య శ్రీ హెడ్గేవార్ స్థాపించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నిత్య శాఖా కార్యక్రమాల్లో చేరి క్రమంగా శారీరకంగా బలసంపన్నులై మానసికంగా జాతీయ భావ బలోపేతులై ఆర్ఎస్ఎస్ లో క్రియాశీలక కార్యకర్తగా ఘటనాయకుని బాధ్యత నుండి దేశనాయకుని దాకా "ఇంతింతై వటుడింతై తానంతై.... అన్న చందాన అటల్ జీ క్రమక్రమంగా ఎదిగారు.

భావుకుడుగా.. సంపాదకుడుగా..అటల్ జీ ఎంతటి జాతీయవాదో అంతటి భావకుడు కూడా... అందుకే ఆయన ప్రసంగాలన్నీ ఎంతో వినసొంపుగా ఉండి ప్రజలందరినీ ఆకట్టుకునేవి. ఆయన గొప్ప భావకవి. బాల్యం నుండే ఆయన అనేక కవితలను వ్రాసేవారు. మధుర భావములతో కూడిన భావ గీతాలను ఎంతో చక్కగా ఆలపించేవారు కూడా.. అంతేకాక లక్నో నుంచి వెలువడి 'రాష్ట్ర ధర్మ్', 'పాంచజన్య' పత్రికలలో చాలా కాలం పని చేశారు. తదుపరి దేశ రాజధాని నుండి వెలువడుతున్న 'వీర్ అర్జున్' అనే పత్రికకు సంపాదకత్వ బాధ్యతను ఎంతో సమర్ధవంతంగా నిర్వహిస్తూ అనేక సంవత్సరాలు ఆ పత్రికను చక్కగా తీర్చిదిద్దారు. ఆయన భారతీయ సాహిత్యాన్ని కాచి వడబోసిన గొప్ప సాహితీవేత్త. మహాకవి తులసీదాసు 'రామచరిత మానస్' ను అమితంగా ఇష్టపడేవారు అటల్ జీ. అంతే కాకుండా అందులోని సారాన్ని బాగా వంట పట్టించుకున్నారు. నవలా సాహిత్య వినీలాకాశంలో శరత్ చంద్రిక వలె వెలుగుతున్న శరత్చంద్రుని నవలా సాహిత్యాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశారు శరత్ స్త్రీ పాత్రను రూపొందించే విధానాన్ని, ఆ పాత్ర చిత్రీకరణను చాలా సందర్భాల్లో అటల్ జీ ప్రశంసించేవారు. సంస్కృత కథా సాహిత్యంలో ఆచంద్రార్కంగా నిలిచిన విష్ణుశర్మచే రచించబడిన 'పంచతంత్ర' కథలు మానవ జీవిత నిర్దేశ కాలనీ వాటి ఎంతో ఆసక్తితో అధ్యయనం చేసేవారు. అటల్ జీ అనేక దశాబ్దాల పాటు మధుర భావ గంభీరంగా జాతీయ భావస్పోరకమైన కవితలెన్నో చక్కగా అల్లిన అటల్ జీ ని "జాతీయ కవి" గా పేర్కొంటే అతిశయోక్తి కాదేమో.....భారతదేశం సామాజిక రాజకీయ పరిస్థితులను క్షుణ్ణంగా అవలోకించి జమ్మూ కాశ్మీర్ ను ఆక్రమించాలనే ప్రయత్నంలో మాటిమాటికి జరుగుతున్న పాకిస్తాన్ దురాక్రమణ మనస్తత్వాన్ని ఎండగడుతూ అటల్జీ రాసిన మేరే ఎక్కియావన్ కవితాయె కవితా సంపుటిలోని " జమ్మూకి పుకార్" అనే కవితలో కొంత భాగాన్ని చూద్దాం!

"...ఏమిటిది? దేశము మళ్లీ
చీలి ముక్కలుచెక్కలవునా!
రక్తసిక్తమ్మయి ధరిత్రి
నెత్తుటేరుల రుధిస్తుందా!
ఎంతవరకీ అసుర మాయల
జ్వాల లిచ్చట క్రమిస్తాయి!
ఏమి భస్మాసురుని అడుగులు
ఎన్నాళ్ళిల స్పృశిస్తాయి!
ఎంత వరకీ జమ్ము ప్రాంతం
జ్వలించంగా సహిస్తామో!
ఎంతవరకీ హింసామద్యం
స్రవించంగా వహిస్తామో!
ఎంతవరకీ లాఠీ గోళీ
మౌనులంగా భుజిస్తామో!
ఎంతవరకీ శత్రుమూకలు
రక్తహోళీలాడుతాయో!
సహనమునకొకు హద్దు ఉంటది!
అబ్ది కడుపున అగ్గి ఉంటది!
మలయ పవనం తుఫానవుతది!
భోళాశంకరుల పాలనేత్రం
తప్పకుండా విచ్చుకొంటది!
(అనువాదం ఆచార్య కసి రెడ్డి గారు)

సచ్చరితుడు - రాజకీయ చతురుడు

1957లో మొట్టమొదటిసారిగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బలరాంపూర్ నియోజకవర్గం నుండి పోటీ చేసి గెలుపొంది, లోక్సభ సభ్యునిగా భారత పార్లమెంటులో అడుగు పెట్టారు అటల్జీ. 1962లో ఓటమి పొందినా మళ్లీ 1967లో బలరాంపూర్ నుండి అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. 1971లో గ్వాలియర్ నుండి 1977లో 1980లో దేశ రాజధాని ఢిల్లీ నుండి విజయం సాధించి తమ విజయ పరంపరను చాటి చెప్పారు. కానీ 1984లో గ్వాలియర్లో మాధవరావు సింధియాతో పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చవిచూశారు. జాతిపిత గాంధీ మహాత్ముని ఆధ్యాత్మిక తత్వము, సర్దార్ వల్లభాయి పటేల్ అకుంఠిత కార్యదీక్ష, శ్యాంప్రసాద్ ముఖర్జీ త్యాగనిరతి, ఆర్ఎస్ఎస్ ద్వితీయ సర్ సంఘచాలక్ గురూజీ నిస్వార్థ సేవ పరాయణాత్వము, పండిత దీనదయాళ్ ఉపాధ్యాయుని ఏకాత్మతా మానవతా విధానము అటల్ జీ పై గాఢమైన ప్రభావాన్ని చూపి, వారిని అనతి కాలంలోనే మచ్చలేని వ్యక్తిత్వం గల నాయకునిగా జాతి జనుల సంక్షేమానికై తన వ్యక్తిగత కాంక్షలను కూడా విడిచిపెట్టిన త్యాగశీలిగా కఠోర బ్రహ్మచర్య వ్రత దీక్షను బూనిన అపర భీష్మునిగా తయారు చేయగలిగాయి.

ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిన వేళ..

1975 జూన్ 25 అర్ధ రాత్రి దేశభక్తుల పట్ల జాతీయ వాదుల పట్ల కాళరాత్రిగా పరిణమించింది. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రభుత్వ నేతృత్వంలో నిరంకుశత్వానికి పరాకాష్టగా అత్యవసర పరిస్థితిని విధించి ప్రజల, పత్రికల ప్రాథమిక హక్కులను కాలరాచింది. ఫలితంగా భారతదేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. అప్పుడు భారత జాతీయ నాయకుడైన అటల్జీని, లోకనాయక్ జయప్రకాష్ నారాయణ్ ను, మొరార్జీ దేశాయ్ తదితర జాతీయ నాయకులను చెరసాలలో బంధించడం జరిగింది. స్వాతంత్ర్య సంగ్రామం లో భాగంగా 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో తెల్లదొరలను ఎదిరించి అనేక పర్యాయాలు జైలు శిక్షణ అనుభవించిన స్వాతంత్ర సమరయోధుడైన అటల్జీకి జైలుకు వెల్లడం అంత కొత్తేమీ కాదు కదా! మహాత్ములైన వారి పట్ల "చెరసాలలు వరచంద్రశాలలే..." అవుతాయి కదా!1977లో లోక్ నాయక్ శ్రీ జయప్రకాశ్ నారాయణ్ గారి పిలుపుమేరకు సిద్ధాంతాలకతీతంగా నాటి ప్రతిపక్షాలన్నీ 'జనతా పార్టీ'లో విలీనమయ్యాయి. ఫలితంగా నూతనంగా 'జనతా ప్రభుత్వం' ఏర్పడింది. నాటి ప్రధాని శ్రీ మొరార్జీ దేశాయి నేతృత్వంలో ఏర్పాటైన మంత్రివర్గంలో అటల్ జీ విదేశాంగ శాఖ మంత్రివర్యునిగా పదవీ బాధ్యతలు చేపట్టి 1979 దాకా సమర్ధవంతంగా ఆ శాఖను నిర్వహించారు. ఆ రెండేళ్లలో విదేశాంగ మంత్రిగా అటల్జీ ప్రదర్శించిన తీరు, వ్యవహార దక్షత నేటికీ కూడా ప్రపంచ నాయకుల చేత కొనియాడ బడుతుంది అంటే అతిశయోక్తి కాదేమో! వారు ప్రదర్శించిన అకుంఠిత కార్యదీక్ష దక్షతలు "న భూతో న భవిష్యతి."

అటల్ జీ హయాంలో పాకిస్తాన్, చైనా, అమెరికా వంటి దేశాలతో భారత్ కు గట్టి సంబంధాలు ఏర్పడ్డాయి. ఆయన చూపిన విదేశాంగ విధానం ఏనాటికైనా ఈ దేశానికి శ్రేయోదాయకం అని చెప్పవచ్చు.

భారతీయ జనతా పార్టీ ఆవిర్భావం

ఆ తర్వాత జరిగిన రాజకీయ మార్పుల వల్ల జాతీయ ప్రతిపక్ష నేతల సమన్వయ లోపం వల్ల జనతా ప్రభుత్వం కుప్పకూలింది. 1980లో అటల్జీ సారధ్యంలో భారతీయ జనసంఘ్ ఆశయాల రూపకల్పనగా "భారతీయ జనతా పార్టీ" ఏర్పడింది. ఆనాటి నుండి 1986 దాకా అటల్జీ వ్యవస్థాపక అధ్యక్షునిగా సలిపిన నిరంతర కృషి ఫలితంగా యావత్ భారతావనిలో భాజపా శాఖోప శాఖలై విస్తరించి పటిష్టవంతమయ్యింది. అనితరసాధ్యమైన అటల్జీ సారధ్యంలో దినదినం ప్రవర్ధమానమైంది. అటల్జీ అజాతశత్రువుగా నాయకులందరి చేత ప్రశంసలు అందుకున్నారు. తమ పార్టీలో కురుపితామహునిలా సమస్యలు వచ్చినప్పుడు సామరస్య పూర్వకంగా పరిష్కరించేవారు. 1991లో ఎల్కే అద్వానీ, డాక్టర్ మురళీ మనోహర్ జోషీల మధ్య ఏర్పడిన అభిప్రాయ భేదాలను తాను సంధానకర్తగా ఉండి తొలగింపజేసి పార్టీ అభివృద్ధి కార్యక్రమంలో వారిని భాగస్వాములను చేశారు. అలాగే ఉమా భారతి, గోవిందాచార్యుల మధ్య తలెత్తిన వివాదాన్ని, హవాలా జోరు హవాలో కొట్టుకుపోతున్న వేళ పార్టీని ఎంతో ప్రజ్ఞా పాటవాలతో, విజ్ఞతతో పార్టీ గౌరవ ప్రతిష్టలకు భంగం వాటిల్లకుండా కాపాడగలిగారు అటల్జీ. అయోధ్యలో బానిస సంకేతాన్ని కరసేవకులు కూల్చినప్పుడు సహజంగా లౌకికవాది అయిన అటల్జీ కొంత కలత చెందినా తన పార్టీలోనే కొంతకాలం అసమ్మతిని ఎదుర్కొనవలసి వచ్చింది. ఎంతో విశాల హృదయంతో ఆ పరిస్థితిని అంతా చక్కదిద్ది, అందరిని దయా హృదయంతో తన అక్కున చేర్చుకోగలిగారు. అంతటి విశాల హృదయులు అటల్జీ.

అజాతశత్రువు - మహా మనీషి

అటల్ జి 1957 నుంచి ఆ జీవన పర్యంతం పార్లమెంటులోనూ బయట కొనసాగించిన ప్రసంగాలు భారతీయులనే కాదు ప్రపంచ నేతలను సైతం మంత్రముగ్ధులను చేశాయి. భాజపాను ద్వేషించే వారైనా సరే, అటల్ జీని మాత్రం అమితంగా గౌరవిస్తారు. అభిమానిస్తారు. ప్రియ సంభాషణ చతురులైన అటల్ జీ ని అందరూ అజాతశత్రువుగా కొనియాడుతారు. అటల్ జీ తమ ప్రసంగాలలో సునిషిత హాస్యాన్ని కురిపించేవారు. ఎంతో గంభీరమైన వాతావరణంలో నైనా సరే, హాస్యపు జల్లులు కురిపించి శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేస్తారు. 1982లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ "శ్రమ యేవ జయతే" అని పిలుపునివ్వగా, అటల్జీ "భ్రమ యేవ జయతే" అంటూ ఎద్దేవా చేశారు. వాస్తవంగా చూస్తే ఆనాడు దేశాన్ని పరిపాలించింది భ్రమతో కూడుకున్న ప్రభుత్వమే కదా! సునిషిత హాస్యోక్తులతో అప్పుడప్పుడు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టి, తాను ఆనందిస్తూ ప్రజలను ఆనందింపజేసే చతుర సంభాషణాధురీణులు అటల్జీ.

1977లో విదేశాంగ శాఖ మంత్రిగా అటల్జీ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో భారత దేశ అధికార భాష అయిన హిందీలోనే అనర్గళంగా ప్రసంగించి, ప్రపంచ ప్రజలందరినీ ఆకట్టుకొని భారత స్వాభిమానాన్ని దేశ ఘన కీర్తిని ఖండ ఖండాంతరాల దాకా విస్తరింపజేసిన మహా మనీషి అటల్జీ. 1995లో జెనీవాలో జరిగిన మానవ హక్కుల అంతర్జాతీయ సదస్సులో భారత బృందానికి నాయకత్వం వహించి తమ వాక్ సంయమనంతో ప్రపంచ నేతలందరినీ ఆకట్టుకొని మతోన్మాదంతో ఉడికిపోతున్న పాకిస్తాన్ ను ఏకాకిని చేసి, ఆ దేశ దుష్ట పన్నాగాన్ని కాలరాచి, ప్రపంచ వీధులలో భారత్ విజయకేతనాన్ని ఎగురవేసిన ఘనచరితుడు అటల్జీ.

భారత్ అత్యున్నత పురస్కారం "భారత రత్న"గా అటల్ జీ

అరువదేళ్ల రాజకీయ జీవితంలో 40 వసంతాల పార్లమెంటరీ జీవితంలో మిత్రులనే తప్ప శత్రువులను ఎరుగరు అటల్జీ. భారత ప్రధాన సజీవులైన సర్వ శ్రీ పండిత నెహ్రూ లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, మొరార్జీ దేశాయ్, విశ్వనాథ్ ప్రతాప్ సింగ్, పీవీ నరసింహారావు గారెలు అటల్ జీ ని "శ్రీ పండిత గోవింద వల్లభ పంత్ ఉత్తమ పార్లమెంటేరియన్" గా ప్రశంసించారంటే వారి ప్రతిభ సంపత్తులు ఎంతటివో అర్థమవుతుంది. సహజకవిగా కీర్తిగాంచిన అటల్జీ 40 ఏళ్లుగా పార్లమెంటులో కొనసాగించిన ప్రసంగాలను చక్కని పుస్తక రూపంలో వెలువరించారు. ఈ గ్రంథం భావి భారత నేతలకు అందరికీ పాఠ్య గ్రంధంగా వినియోగపడుతుందంటే అతిశయోక్తి కాదేమో! అనితర సాధ్యమైన ఆయన కార్య సారధ్యమునకు అసమానముగు రాజ నీతిజ్ఞతకు మెచ్చి భారత ప్రభుత్వం "పద్మ విభూషణ్" బిరుదు తో సత్కరించింది.మరణానంతరం 2015 లో భారత ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన "భారతరత్న" పురస్కారం తో శ్రీ అటల్ బిహారీ వాజపేయిని గౌరవించి తన ఫ్లితను చాటుకున్నది.ఆ సత్కారం ఆయనకే కాదు భారత రాజనీతికే జరిగిన సన్మానమని నాడు ప్రజలంతా అభినందించారు. ఆనందించారు. శీలవంతమైన వ్యక్తిత్వానికి అమితంగా ప్రభావితుడైన బహుభాషా కోవిదుడు, అపర చాణిక్యుడు, భారత మాజీ ప్రధానమంత్రి, అయిన శ్రీ పాములపర్తి వెంకట నరసింహారావు గారు అటల్ జీని "గురుదేవ్" గా సంభావించి సత్కరించారంటే అటల్జీది ఎంతటి ఉన్నత వ్యక్తిత్వమో అర్థమవుతుంది. అటల్ జి భారత ప్రజానీకానికి ముఖ్యంగా నాయక గణానికి గురుదేవులే మరి!భారతదేశ రక్షణ నిమిత్తం అటల్ జి ఇచ్చిన సందేశాలు అపూర్వమైనవి. 2018 ఆగస్టు 16న 93 సంవత్సరాల భారత పూర్వ ప్రధానమంత్రి, కవి, పాత్రికేయుడు, రాజనీతి దురంధరుడు, పండితుడు, విమర్శకుడు, సమరసవాది, సమన్వయ వాది, మానవతావాది, ప్రకార దేశభక్తుడు, యోగి అరవిందులు చెప్పిన అఖండ భారతాన్ని దర్శించిన మహాదృష్ట. దార్శనికుడు అన్నింటిని మించి భారత జాతీయ ఆత్మ. అజన్మ బ్రహ్మచారి, అయిన అటల్ బిహారీ వాజపేయి మనలను వదిలి వెళ్లారు. నేడు మన మధ్య లేరు. కాని ఆయన అక్షరాలు ఉన్నాయి. ఆ అక్షరాల్లో దాగిన అంతరం గాలు ఉన్నాయి. వాటిని అధ్యయనం చేసి భారతీయ జనత ఉన్నది. ఆయన వెనుక ప్రాచీన ఆర్వాచీన భారతీయ విజ్ఞాన శాస్త్ర సంపద ఉన్నది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శిక్షణ ఉన్నది. జమ్ము కాశ్మీర్ నిమిత్తం ప్రాణాలర్పించిన డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ నేతృత్వమున్నది. ఏకాత్మ మానవతావాద ప్రవక్త పండిత దీన్ దయాళ్ జీ మార్గదర్శనం ఉన్నది. అందుకే అటల్ జీ మన కళ్ళ ముందు "భారత జాతీయ ఆత్మ" గా చిరకాలం కనిపిస్తారు. ఆ మహనీయునికి అశేష భారత ప్రజావళి పక్షాన అక్షర సుమాంజలి.

"సాహిత్య కళా విభూషణ"
చౌదూరి నరసింహారావు
సాహిత్య, సామాజిక విశ్లేషకులు

ఇంద్ర పాలనగర వాసికి అరుదైన సత్కారం

జానపద కళాకారుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు చిన్నపాక సంజయ్ కుమార్ కు నగదు పురస్కార సత్కార సన్మానం

యాదాద్రి భువనగిరి జిల్లా:- రోమింగ్ న్యూస్:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ,యువ కళావాహిని,తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సారిపల్లి కొండలరావు సౌజన్యలతో ఇంద్రపాల నగర్ నివాసి తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు చిన్నపాక సంజయ్ కుమార్ కు రవీంద్రభారతిలో నగదు పురస్కారంతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా సారిపల్లి కొండలరావు,సభ ప్రారంభకులు డాక్టర్ కె.వి.రమణాచారి రిటైర్డ్ ఐఏఎస్,తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం గౌరవాధ్యక్షులు,గౌరవ అతిథులుగా డాక్టర్ అలేఖ్య పుంజాల సంగీత నాటక అకాడమీ చైర్మన్,డాక్టర్ వెన్నెల సంస్కృతిక సారధి చైర్మన్,దైవజ్ఞ శర్మ ,వంగ శ్రీనివాస్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం అధ్యక్షులు,సుంచు లింగన్న తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి,లంక లక్ష్మీనారాయణ యువ కళావాహిని అధ్యక్షులు, విజయశ్రీ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం మహిళ అధ్యక్షురాలు, కవిత,తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం మహిళా ప్రధాన కార్యదర్శి లతోపాటు రాష్ట్ర కార్యదర్శులు 33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.నగదు పురస్కార అవార్డు గ్రహీత తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం యాదాద్రి జిల్లా అధ్యక్షులు చిన్నపాక సంజయ్ కుమార్ మాట్లాడుతూ..ఈ అరుదైన సత్కారంతో సత్కరించిన 33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులకు జానపద కళాకారులకు ఎల్లవేళలా అండగా ఉంటూ ముందుకు నడిపిస్తున్న తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం వంగ శ్రీనివాస్ గౌడ్ ప్రధాన కార్యదర్శి లింగన్నకు రాష్ట్ర కమిటీకి అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

SVN DIGITAL SCHOOL
NURSERY to X CLASS

SVN DIGITAL SCHOOL

గుట్ట ఎస్.వీ.ఎన్ డిజిటల్ స్కూల్‌లో

ఘనంగా క్రిస్మస్ సంబరాలు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 24(రోమింగ్ న్యూస్): యాదగిరిగుట్ట ఎస్.వీ.ఎన్ డిజిటల్ హైస్కూల్‌లో క్రిస్మస్ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థులు, సిబ్బంది, తల్లిదండ్రుల మధ్య ఆనందం మరియు ఉత్సాహం నింపిన ఈ వేడుకలు సేమీ క్రిస్మస్ స్ఫూర్తిని ప్రతిబింబించాయి. చిన్నారులు సాంటా క్లాజ్ మరియు దేవదూతల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. వారి చిలిపితనం మరియు సృజనాత్మకత అందర్నీ ఆకర్షించింది, క్రిస్మస్ మాయను అందరికీ చేరవేసింది. వేడుకల ప్రధాన ఆకర్షణగా 9వ తరగతి విద్యార్థులు రూపొందించిన స్కిట్ అందరినీ ఆకట్టుకుంది. యేసు క్రీస్తు పుట్టుకను విశదీకరిస్తూ వారు ప్రదర్శించిన ఈ నటన అందరిని అలరించింది. భావోద్వేగభరితమైన కథనం, విద్యార్థుల గొప్ప అభినయం ఈ స్కిట్‌ను ఆస్వాదించే విధంగా కనువిందు చేసింది. వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థుల బృందం ఆలపించిన క్రిస్మస్ కీర్తనలు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించాయి. వేడుకలు ప్రేమ, శాంతి, సమైక్యత సందేశంతో ముగిశాయి, సీజన్ యొక్క విలువలను పునరుద్ధరించాయి. ఈ సందర్భంగా, ఎస్.వీ.ఎన్ ఫౌండర్, కరస్పాండెంట్ గొట్టిపర్తి భాస్కర్ విద్యార్థులు మరియు సిబ్బంది ఎంతో సమన్వయంతో చేస్తున్న కృషిని ప్రశంసించారు. కుల మతాలకతీతంగా పాఠశాలలో బోధన కొనసాగుతూ వారి సంప్రదాయాలను గౌరవిస్తున్న ఘనత ఎస్విఎన్ కు దక్కిందని చెప్పారు. మతాలు వేరైనా మానవత్వాన్ని ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ గొట్టిపర్తి మాధురి విద్యార్థుల ప్రదర్శనలపై గర్వం వ్యక్తం చేస్తూ, ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో దయ మరియు ఐక్యత విలువలను పెంపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ గొట్టిపర్తి వృతిక్ ఈ వేడుకను ఘనవిజయం చేయడంలో స్కూల్ టీమ్ చూపించిన కృషిని అభినందించారు.

ఎస్విఎన్ స్టాఫ్ మెంబర్స్ బలరాజు, విజయమేరీ వంటి వారు ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కీలక పాత్ర పోషించారు. ఈ వేడుకలు అందరికీ చిరస్మరణీయ అనుభవాలను అందించాయి, ఎస్వీఎన్ డిజిటల్ స్కూల్ కుటుంబానికి మరపురాని రోజుగా నిలిచిపోయాయి.

SVN DIGITAL SCHOOL
NURSERY CLASS
YADAG

SVN DIGITAL SCHOOL

SVN DIGITAL SCHOOL
NURSERY to X CLASS
YADAG UTTA

SVN
NURSERY to X CLAS
YADAGIRIG TTA

SVN DIGITAL SCHOOL
NURSERY to X CLASS
YADAG GUTTA

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
25 డిసెంబర్ 2024

ICC
CHAMPIONS
TROPHY
PAKISTAN 2025

ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ విడుదల..

వచ్చే ఏడాది పాకిస్థాన్‌లో జరగబోతున్న ఛాంపియన్స్ ట్రోఫీ 2025) షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 19 నుంచి మార్చ్ 9వ తేదీ వరకు ఈ టోర్నీ జరగనుంది. భారత్ కోరినట్టుగానే ఈ టోర్నీ హైబ్రిడ్ మోడల్‌లో జరగబోతోంది. భారత్ ఆడబోయే మ్యాచ్‌లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరగబోతున్నాయి. ఈ ఛాంపియన్స్ ట్రోఫీ మాత్రమే కాదు.. 2025 నుంచి 2027 మధ్య జరగబోయే అన్ని ఐసీసీ ఈవెంట్‌లలో భారత్, పాక్ మధ్య జరిగే మ్యాచులన్నీ తటస్థ వేదికలపైనే జరుగుతాయి. ఐసీసీ మహిళల వన్డే ప్రపంచ కప్ 2025 (భారత్ ఆతిథ్యం), ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ 2026 (భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యం) కోసం కూడా పాక్ టీమ్ భారత్ రాదు. ఆ మ్యాచ్‌లు తటస్థ వేదికల పైనే జరుగుతాయి. ఇక, 2028లో జరిగే ఐసీసీ టీ20 వరల్డ్ కప్ హక్కులను పాకిస్తాన్ దక్కించుకుంది. ఆ మ్యాచ్‌లు కూడా తటస్థ వేదికలలోనే జరగనున్నాయి. కాగా, వచ్చే ఏడాది జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీలో ఇండియా–పాక్ (%×అఒఖు జం ౄఖుఏఆఖుఅ%) మ్యాచ్ దుబాయ్ వేదికగా ఫిబ్రవరి 23న జరగబోతోంది. ఈ టోర్నీలో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొనబోతున్నాయి. ఇందులో గ్రూప్–ఏలో భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ ఉన్నాయి. గ్రూప్–బిలో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్థాన్, ఇంగ్లండ్ జట్లు ఉన్నాయి.

అశ్విన్ స్థానంలో తనుష్

అశ్విన్ స్థానంలో ముంబై ఆఫ్ స్పిన్నర్ తనుష్ కోటియన్ భారత జట్టులో చేరనున్నాడు. తనుష్ ప్రస్తుతం..విజయ్ హజారే ట్రోఫీకోసం అహ్మదాబాద్‌లో ఉన్నాడు. మంగళవారం అతడు ముంబై నుంచి మెల్‌బోర్న్...అశ్విన్ స్థానంలో తనుష్అశ్విన్ స్థానంలో ముంబై ఆఫ్ స్పిన్నర్ తనుష్ కోటియన్ భారత జట్టులో చేరనున్నాడు. తనుష్ ప్రస్తుతం..విజయ్ హజారే ట్రోఫీకోసం అహ్మదాబాద్‌లో ఉన్నాడు. మంగళవారం అతడు ముంబై నుంచి మెల్‌బోర్న్ బయల్దేరనున్నట్లు సమాచారం. వాస్తవంగా..కోటియన్‌కు బదులు లెఫ్టామ్ స్పిన్నర్ అక్షర్ పటేల్‌ను ఆస్ట్రేలియా పంపాలనుకున్నారు. అయితే హజారే టోర్నీ తొలి రెండు మ్యాచ్‌ల్లో ఆడించి అక్షర్‌ను ఆసీస్ పంపాలనుకున్నా.. కుటుంబ పనుల కారణంగా అతడు ఆ మ్యాచ్‌లకు దూరమ య్యాడు. దీంతో తనుష్‌కు చాన్స్ దక్కింది.ఎవరితను..?26 ఏళ్ల తనుష్ దేశవాళీ పోటీల్లో నికార్సయిన బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా పేరు పొందాడు. 2023–24 రంజీ సీజన్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచాడు. ముంబై జట్టు 42వ రంజీట్రోఫీ టైటిల్ గెలవడంలో కీలక భూమిక పోషించాడు. ఆ సీజన్‌లో 16.96 సగటుతో 29 వికెట్లు తీశాడు. 41.83 సగటుతో 502 పరుగులు చేశాడు. ఓవరాల్‌గా 33 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 101 వికెట్లు పడగొట్టాడు. రెండు శతకాలతో మొత్తం 1525 పరుగులు సాధించాడు. మెల్‌బోర్న్ గ్రౌండ్‌లో తనుషకు మంచి రికార్డే ఉంది. ఇటీవలి పర్యటనలో భారత్ 'ఏ' తరపున ఎనిమిదో నెంబర్‌లో బరిలోకి దిగి 44 పరుగులు చేశాడు.

దుబాయ్‌లో దగ్గరైన సానియా మీర్జా, మహ్మద్ షమీ.. నిజమేనా..

గత కొన్ని రోజులుగా భారత ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ (%వీశీష్ణుఎఎవస రాష్ట్రుఎఅ%), భారత మాజీ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా (%ఝఅఋ వీఅతీఓు%) తరచుగా వార్తల్లో నిలుస్తున్నారు. వీరిద్దరి వ్యక్తిగత లేదా వృత్తిపరమైన జీవితాలు వేరైనప్పటికీ అభిమానులు మాత్రం వీరిని వదలడం లేదు. ఈ క్రమంలోనే ప్రస్తుతం దుబాయ్‌లో మహమ్మద్ షమీ, సానియా మీర్జా కలిసి ఉన్న చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. షమీ, సానియా మీర్జా కలిసి దుబాయ్‌లో ఉన్నారని, బీచ్‌లో తిరుగుతున్నారని ఫేస్‌బుక్‌లో క్రికెట్.గురు అనే పేజీ పేర్కొంది. అదే పేజీలో వారిద్దరూ కలిసి ఉన్న చిత్రాలను కూడా షేర్ చేసింది. వీటిలో సానియా, షమీలు కలిసి ఉన్నట్లు కనిపిస్తున్నారు. ఈ చిత్రాలను చూసిన అభిమానులు పలు రకాలుగా కామెంట్లు చేస్తున్నారు.

'సూర్యఘర్'కు దరఖాస్తు ఎలా? 78 వేల రాయితీ ఎలా పొందాలి?

ఇళ్ల పైకప్పులపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకుని సౌర విద్యుత్తు పొందడానికి సబ్సిడీ ఇచ్చేందుకు కేంద్ర కేబినెట్ పచ్చజెండా ఊపింది.2023–24 నుంచి 2026–27 వరకు నాలుగేళ్లు నడిచే ఈ పథకానికి రూ.75,021 కోట్లు కేటాయించింది. ఈ మేరకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇంతకీ ఈ పథకం కింద రాయితీ ఎంత? ఎలా దరఖాస్తు చేసుకోవాలి?పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకం కింద రాయితీని రెండు భాగాలుగా విభజించి కేంద్రం ఇవ్వనుంది. 2 కిలోవాట్ల సామర్థ్యానికి 60%, అంతకు పైబడిన యూనిట్లకు 40% మొత్తాన్ని రాయితీ కింద అందిస్తారు. మూడు కిలోవాట్ల సౌర విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయడానికి రూ.1.45 లక్షలు ఖర్చయితే అందులో కేంద్రం గరిష్ఠంగా రూ.78 వేలు అందిస్తుంది. మిగిలిన మొత్తాన్ని పూచీకత్తు అవసరం లేని బ్యాంకు రుణం రూపంలో సమకూరుస్తుంది. రెపోరేట్‌కు అదనంగా 0.5% వడ్డీని దానిపై వసూలు చేయనుంది. ప్రస్తుతం ఇది 7% ఉంది.కరెంట్ అమ్ముకోవచ్చు..ఇంటిపై ఏర్పాటు చేసుకునే సోలార్ వ్యవస్థ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో తొలి 300 యూనిట్లు లబ్ధిదారుడు ఉచితంగా వాడుకోవచ్చు. మిగిలిన 600 యూనిట్లను నెట్ మీటరింగ్ ద్వారా విక్రయించుకోవచ్చు. దీనివల్ల నెలకు రూ.1,265 ఆదాయం వస్తుంది. అందులో రూ.610ని బ్యాంకు రుణవాయిదా కింద జమ చేసుకుంటారు. దీనివల్ల ఏడేళ్లలో ఆ రుణం తీరిపోతుందని కేంద్రమంత్రి అనురాగ్ ఠాకుర్ తెలిపారు. 1 కిలోవాట్‌కు రూ.30వేలు, 2 కిలోవాట్ల వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నవారికి రూ.60 వేలు, 3 కిలోవాట్ల ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నవారికి రూ.78వేలు గరిష్ఠ రాయితీ అందుతుందని చెప్పారు.నెలకు 0–150 యూనిట్ల విద్యుత్ వినియోగించే వారికి 1–2 కిలోవాట్ల రూఫ్‌టాప్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందని సూర్యఘర్ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. 150–300 యూనిట్లు చొప్పున వినియోగించే వారు 2–3 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. 300 యూనిట్లకు పైబడి విద్యుత్‌ను వినియోగించే వారు 3 కిలోవాట్, ఆ పైబడి సామర్థ్యం కలిగిన సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. 3 కిలోవాట్లకు మించి సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నా గరిష్ఠంగా రూ.78వేలు మాత్రమే సబ్సిడీగా చెల్లిస్తారు.ఉమ్మడిగానూ..నివాసుల సంక్షేమ సంఘాలు, బృందంగా నివాసాలు ఏర్పాటు చేసుకున్నవారు ఉమ్మడి ప్రాంతంలోని విద్యుద్దీపాలు, వాహనాల ఛార్జింగ్ స్టేషన్ల కోసం 500 కిలోవాట్ల వరకు రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవచ్చని కేంద్రమంత్రి ఠాకుర్ చెప్పారు. ఇందుకోసం ఒక్కో కిలోవాట్‌కు రూ.18 వేల వరకు రాయితీ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ప్రతి జిల్లాలో ఒక సౌర నమూనా గ్రామాన్ని తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ఈ విషయంలో బాగా పనిచేసే పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. 2025 కల్లా దేశంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలన్నింటిపైనా రూఫ్‌టాప్ సోలార్ విద్యుదుత్పత్తి వ్యవస్థ ఏర్పాటుచేస్తామని, రాయితీ మొత్తాన్ని పూర్తిగా కేంద్రమే ఇస్తుందని తెలిపారు. ఈ పథకం వల్ల 17 లక్షల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు.దరఖాస్తు ప్రక్రియ ఇలా.. పోర్టల్‌లో పేరును రిజిస్టర్ చేసుకోవాలి.

ఇందుకోసం మీ రాష్ట్రం, విద్యుత్ సరఫరా చేసే కంపెనీని ఎంచుకోవాలి. మీ విద్యుత్ కనెక్షన్ కన్స్యూమర్ నంబరు, మొబైల్ నంబరు, ఈ–మెయిల్ ఐడీని ఎంటర్ చేయాలి. కన్స్యూమర్ నంబర్, మొబైల్ నంబర్‌తో లాగిన్ అవ్వాలి. అక్కడ 'రూఫ్‌టాప్ సోలార్' కోసం అప్లయ్ చేసుకోవాలి.దరఖాస్తు పూర్తి చేసి డిస్కమ్ నుంచి అనుమతులు వచ్చేవరకు వేచి చూడాలి. అనుమతి వచ్చిన తర్వాత మీ డిస్కమ్‌లోని నమోదిత విక్రేతల నుంచి సోలార్ ప్లాంట్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఇన్‌స్టలేషన్ పూర్తయిన తర్వాత, ఆ ప్లాంట్ వివరాలను పోర్టల్‌లో సమర్పించి నెట్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకోవాలి.నెట్ మీటర్‌ను ఇన్‌స్టాల్ చేశాక, డిస్కమ్ అధికారులు తనిఖీలు చేస్తారు. అనంతరం పోర్టల్ నుంచి కమిషనింగ్ సర్టిఫికేట్ ఇస్తారు.ఈ రిపోర్ట్ పొందిన తర్వాత మీ బ్యాంకు ఖాతా వివరాలతో పాటు క్యాన్సిల్డ్ చెక్‌ను పోర్టల్‌లో సబ్మిట్ చేయాలి. 30 రోజుల్లోగా మీ ఖాతాలో సబ్సిడీ జమ అవుతుంది.

Stock market ppt presentation

బిజినెస్

ఫ్లాట్‌గా ముగిసిన దేశీయ సూచీలు..

Derivatives on BSE
RBLB18D
562.000

గతవారం భారీ నష్టాలకు సోమవారం బ్రేకులు వేసి లాభాల బాట పట్టిన దేశీయ సూచీలు మంగళవారం తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. లాభనష్టాలతో దోబూచులాడాయి. ఆటో, ఎఫ్ఎమ్‌సీజీ రంగాలు రాణించినప్పటికీ, మెటల్ స్టాక్స్ నష్టాల్లో ఉండడంతో సెన్సెక్స్ ఒడిదుడుకులు ఎదుర్కొంది.గతవారం భారీ నష్టాలకు సోమవారం బ్రేకులు వేసి లాభాల బాట పట్టిన దేశీయ సూచీలు మంగళవారం తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. లాభనష్టాలతో దోబూచులాడాయి. ఆటో, ఎఫ్ఎమ్‌సీజీ రంగాలు రాణించినప్పటికీ, మెటల్ స్టాక్స్ నష్టాల్లో ఉండడంతో సెన్సెక్స్ ఒడిదుడుకులు ఎదుర్కొంది. చివరకు ఫ్లాట్‌గా ముగిసింది. నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే లాభాలను ఆర్జించింది. (%దీబంఱఅవం చీవఞం).

సోమవారం ముగింపు (78, 540)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం దాదాపు 150 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ కొద్దిసేపటికే నష్టాలోకి జారుకుంది. 150 పాయంట్లకు పైగా నష్టపోయి 78, 397 వద్ద ఇంట్రాడే కనిష్టానికి చేరుకుంది. ఆ తర్వాత లాభాల్లోకి వచ్చి ఒక దశలో 300 పాయింట్లకు పైగా లాభపడి 78, 877 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరుకుంది. మధ్యాహ్నం తర్వాత అమ్మకాలు మొదలవడంతో కాస్త ఒడిదుడుకులకు లోనైంది. చివరకు 67 పాయింట్ల స్వల్ప నష్టంతో 78, 472 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. 15 పాయింట్ల లాభంతో రోజును ప్రారంభించింది. చివరకు 25 పాయింట్ల నష్టంతో 23, 727 వద్ద రోజును ముగించింది. సెన్సెక్స్‌లో ఆర్బీఎల్ బ్యాంక్, బయోకాన్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, హిందుస్తాన్ కాపర్, టాటా కెమికల్స్ షేర్లు లాభాలు అందుకున్నాయి. పీబీ ఫిన్‌టెక్, మాక్రోటెక్ డెవలపర్స్, సైమన్స్, దాల్మియా భారత్ షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. మిడ్ క్యాప్ ఇండెక్స్ 35 పాయింట్లు కోల్పోయింది. బ్యాంక్ నిఫ్టీ 84 పాయింట్లు నష్టపోయింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 85.20గా ఉంది.

ఏటీఎమ్ సాగుతో... ఏడాదంతా సిరులే!

కూలీలకు ఏ రోజు కూలి డబ్బులు ఆ రోజు అందుతుంటాయి. ఉద్యోగులకు నెలకోసారి జీతం వస్తుంది. కానీ, రైతులు మాత్రం ఏడాదిలో ఒకట్రెండు సార్లు పంటను అమ్ముకున్నప్పుడే డబ్బులు కళ్లజూస్తారు.అయితే కొందరు అన్నదాతలు ఎనీ టైమ్ మనీ(ఏటీఎమ్) పొందేలా కొత్త రకం వ్యవసాయానికి శ్రీకారం చుట్టి- ఏడాది పొడవునా ఆదాయం పొందుతున్నారు. మరి రైతును రాజుగా మారుస్తున్న ఆ ఏటీఎమ్ సాగు విధానం ఏంటో చూద్దామా!చాలామంది రైతులు తోటివారు ఏం పండిస్తే అదే తామూ సాగు చేయాలను కుంటారు. లేదంటే తమకి తెలిసిన పంటల్నే వేస్తుంటారు. అయితే మార్కెట్‌లో ఏ పంట డిమాండ్ ఆ పంటదే. ఒక్క పంటే వేస్తే- ఒక్కో సీజన్‌లో దానికి రేటు పడిపోవచ్చు. అదే ఎక్కువ రకాలు సాగు చేస్తే ఒకటి కాకపోయినా ఇంకో దానిలో మంచి లాభాలే వస్తాయి కదా! అందుకే పండ్ల తోటల్లోనూ, కొబ్బరి తోటల్లోనూ ఒకట్రెండు అంతర పంటలు వేయడం చూస్తుంటాం. అర ఎకరంలో పదికి మించి పంటలు పండించడం ఎక్కడైనా చూశారా? ఏటీఎమ్ పద్ధతిలో సాగు చేసే రైతన్నల పొలాలకు వెళితే ఆ పంటల వైవిధ్యం కనిపిస్తుంది.ఈ విధానంలో పూలు-పండ్ల జాతులు, తీగజాతులు, దుంప జాతులు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కలప జాతుల్నీ కలిపి ఒకేసారి సాగు చేస్తుంటారు. ఎందుకంటే కొన్ని పంటలు నెలరోజుల్లోనే కాపుకొస్తే, మరికొన్ని రెండు నెలలకు, మరికొన్ని మూడు నెలలకు వస్తాయి. అలా దశలవారీగా చేతికొచ్చే పంటల్ని ఎంపిక చేసుకుని వరస క్రమంలో సాగు చేయడం ఒక పద్ధతి. వరస క్రమం లేకుండా ఖాళీ ఉన్న చోట ఏదో ఒక మొక్కని వేసి నేలని కప్పేయడం మరో విధానం. ఎలా చేసినా నీడ వల్ల తేమ ఎక్కువగా ఉంటుంది. రాలిన ఆకులు కుళ్లిపోయి భూసారాన్ని పెంచుతాయి. ఏటీఎమ్ విధానంలో సాగు చేసేవారు ముందుగా పొలం చుట్టూ ఎత్తుగా పెరిగే మొక్కజొన్న, కంది, చెరకు, జొన్న, కొర్రల వంటివి బోర్డరు పంటగా వేస్తారు. లోపల పండ్ల జాతుల్నీ లేదంటే చందనం, శ్రీగంధం, మహోగని వంటి కలప ఆధారిత మొక్కల్నీ ప్రధాన పంటగా వేస్తూ మిగతావి సాగు చేస్తారు. ఎలా చేసినా నిత్యం దిగుబడి వచ్చేలా పంటల్ని ఎంపిక చేసుకోవడం ముఖ్యం.తక్కువ నీళ్లు చాలు...బోర్డరు పంటల్ని నాటుకున్న తరవాత ఎత్తుగా పెరిగేవీ- మధ్యస్థంగా ఎదిగేవీ- వంగ, బెండ, గోరు చిక్కుడులా గుబురుగా పెరిగేవీ- సన్నగా పాకే చిక్కుడు తీగ జాతినీ- అవి పాకడానికి వీలుగా మునగ, కరివేపాకు వంటివాటినీ ఎంపిక చేసుకుంటున్నారు రైతులు. ఆ పక్కనే బంతి, చామంతి, కనకాంబరం, మల్లె... ఇలా సీజన్ల వారీగా నిత్యం కోతకొచ్చే పువ్వుల్నీ సాగు చేస్తున్నారు. వీటి మధ్యలోనే భూమిలో పండే ఉల్లి, అల్లం, పసుపు, వేరుసెనగలు కూడా సరైన ఎంపిక. మధ్య మధ్యలో పసుపు వేయడం వల్ల అందులోని యాంటీసెప్టిక్ గుణాలు ఎన్ని రకాల పంటలు వేసినా వాటి వేళ్లకు తెగుళ్లు ఆశించకుండా కాపాడతాయి. రకరకాల పంటలు ఉండటం వల్ల పరాగ సంపర్కం బాగా జరిగి దిగుబడి కూడా పెరుగుతుంది. నీళ్లు చాలా తక్కువగా ఉండే ప్రాంతాల్లోనైతే 'వానకు ముందు విత్తే'(ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) పద్ధతిని ఎంచుకుంటారు. వేసవిలోనే బంకమట్టి, ఇతర ఎరువులు, బూడిద పూత వేసిన విత్తనాలను నాటి పైన కాయగూరలూ, ఇతర వ్యర్థాలూ, సెనగ పొట్టుతో నేలని కప్పెట్టి ఉంచుతారు. కుళ్లకుండా భూమి పొరలోనే తాజాగా ఉన్న విత్తనాలు వర్షంపడగానే మొలకెత్తుతాయి. వ్యర్థాల వల్ల ఆ భూమి తేమగా ఉంటుంది. ఈ విధానంలో నువ్వులు, ఆముదాలు, చిరుధాన్యాలు, గోరుచిక్కుడు, మొక్కజొన్న, వేరుసెనగ, గుమ్మడి, అల్లం, పసుపు వంటి వాటిని పండిస్తారు.

అవిసె గింజలు... ఒక్క చెంచా చాలు!

FLAXSEED GEL
LADDU FLAXSEEDS
Flackers
FLAX SEED

'పాలల్లో లేదా పెరుగులో చెంచా అవిసెగింజలపొడి వేసుకుని తీసుకుంటే ఒంటికి ఎంత మంచిదో తెలుసా...' 'వేడివేడి అన్నంలో కాస్త అవిసెగింజల కారప్పొడీ నెయ్యి వేసుకుని తిని చూడండి...', 'వారానికోసారి అవిసెగింజల జెల్‌ను తలకు రాస్తే జుట్టురాలడం బాగా తగ్గుతుంది...' అంటూ ఆరోగ్యానికీ అందానికీ ప్రాధాన్యమిచ్చేవారే కాకుండా వంటకాల్లో వెరైటీలు కోరుకునేవారూ అవిసెగింజల్ని తెగ వాడేస్తున్నారిప్పుడు.దానికి తగినట్లుగా వాటితో చేసిన ఉత్పత్తులూ రకరకాలుగా వచ్చేయడంతో ఒకప్పటితో పోలిస్తే.. ఇప్పుడు వీటి వాడకం బాగా పెరిగిందనే చెప్పొచ్చు. ఇంతకీ వీటి ప్రత్యేకత ఏంటో చూసేద్దామా మరి.నెలవారీ నిత్యావసర సరకుల జాబితాలో పోపు దినుసులతోపాటు నువ్వులూ పల్లీలూ పుట్నాలూ పెసలూ... అంటూ రకరకాలను చేర్చేస్తుంటాం. ఈ మధ్య ఆ జాబితాలో అవిసెగింజల పేరూ రాసేస్తున్నారు చాలామంది గృహిణులు. నిజానికి ఇవి ఎప్పటినుంచో అందుబాటులో ఉన్నా వీటి వాడకంపైన బోలెడు సందేహాలూ అపోహాలూ ఉండడంతో ఈ గింజల్ని పక్కన పెట్టేసినవారే ఎక్కువ. అయితే... కొంతకాలంగా పోషకాహార నిపుణులు అవిసెగింజల వల్ల కలిగే ప్రయోజనాలను తరచూ తెలియజేయడం, తయారీదారులూ వీటితో రకరకాల పదార్థాలను తీసుకురావడంతో... ఈ మధ్య అవిసెల వాడకం బాగా పెరిగిందనే చెప్పొచ్చు. విదేశాల్లో పుట్టిన ఈ గింజలకు ఇక్కడా ఇంతటి గుర్తింపు లభించడం వెనుక వీటివల్ల ఒనగూడే ఆరోగ్య ప్రయోజనాలే ప్రధాన కారణం మరి.అసలేంటీ మొక్క...గోధుమవర్ణంలో ఉండి, నువ్వుల్లా కనిపించే అవిసెగింజల్ని ఆంగ్లంలో ఫ్లాక్స్‌సీడ్స్ అని పిలుస్తారు. ఈ గింజల శాస్త్రీయ నామం లినమ్ ఉసిటాటిసిమమ్ (ఉసిటాటిసిమమ్ అంటే లాటిన్‌లో 'చాలా ఉపయోగకరం' అని అర్థం). ఈజిప్టులో ఈ మొక్కను దాదాపు ముప్ఫైవేల సంవత్సరాల క్రితం నుంచీ పెంచుతుంటే... మనదేశంలో అయిదువేల సంవత్సరాల క్రితం అందుబాటులోకి వచ్చిందట. ప్రారంభంలో ఈ మొక్కల నుంచి నారను సేకరించి దుస్తుల తయారీకోసం ఉపయోగించేవారట. మనం ఇప్పుడు వాడుతున్న లినెన్ వస్త్రం ఈ అవిసెగింజల నారనుంచే వచ్చింది. మొదట్లో ఆ నారతో దుప్పట్లూ, లోదుస్తులూ, కర్టెన్లూ తదితరాలనే తయారుచేసినా... ఫ్యాషన్ ప్రపంచంలో ఇప్పుడు లినెన్‌కి ఎంతో డిమాండు ఉంది. రోజులు మారేకొద్దీ వాటి నుంచి అందే పోషకాలూ, కలిగే ఆరోగ్య ప్రయోజనాలపైన అవగాహన పెరగడంతో ఈ గింజల్నీ, నూనెనూ వంటకాల్లో వాడే వారి సంఖ్యా పెరిగింది. దాదాపు మూడున్నర అడుగుల ఎత్తులో ఉండే ఈ మొక్కలకు వచ్చే పూలు సాధారణంగా నీలంరంగులోనే ఉన్నా... కొన్నిచోట్ల తెలుపు, పసుపు, ఎరుపు వర్ణాల్లోనూ పూస్తాయి. మొక్కలకు గుత్తులు గుత్తులుగా పూసే చిన్నచిన్న మొగ్గల్లోనే అవిసెగింజలు ఉంటాయి. ఆ మొగ్గల్ని ఎండబెట్టి గింజల్ని వేరుచేస్తారు.ఎన్నెన్నో పోషకాలు.. .సాధారణంగా అవిసెగింజలు గోధుమ, పసుపు రంగుల్లో ఉంటాయి. వీటిల్లో ఒమేగా త్రీ ఫ్యాటీ ఆమ్లాలతోపాటు పీచు, విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్స్, మాంసకృత్తులు, కాపర్.. వంటి ఎన్నో పోషకాలు లభిస్తాయి.అవిసెగింజల్లో ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువశాతం ఉంటాయి. ప్రతిరోజూ టేబుల్‌స్పూను అవిసెగింజల పొడిని తీసుకోవడం వల్ల సుమారు 1.8 గ్రాముల ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్స్ శరీరానికి అందుతాయి. ఈ గింజల్ని కానీ, నూనెను కానీ తీసుకోవడం వల్ల గుండె కొట్టుకునే వేగం క్రమబద్ధం కావడంతోపాటూ హృద్రోగాలూ అదుపులో ఉంటాయని పరిశోధకులు తేల్చారు. అందుకే మొదట్లో వీటిని కేవలం గుండె ఆరోగ్యంకోసమే వాడేవారట. క్రమంగా పరిశోధనలు జరిగేకొద్దీ... మరెన్నో ప్రయోజనాలు కలుగుతాయని తేలడంతోపాటూ ఇతర అనారోగ్యాలూ నయమవుతాయని నిరూపితమైందని చెబుతారు పోషకాహార నిపుణురాలు డాక్టర్ లతాశశి. అవిసెగింజల్లో పీచు- సాల్యుబుల్(కరిగే), ఇన్‌సాల్యుబుల్(కరగని) రకాల్లో ఉండటం విశేషం. ఈ పీచు పదార్థం జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరిచి, జీర్ణసంబంధ సమస్యలు తలెత్తకుండా చేస్తుంది. అవిసెగింజల్లోని సాల్యుబుల్ ఫైబర్ చెడుకొలెస్ట్రాల్‌ను తగ్గించి తద్వారా గుండె జబ్బులతోపాటూ స్థూలకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, మెటబాలిక్ సిండ్రోమ్ వంటి సమస్యలు అదుపులో ఉండేలా చేస్తుంది. బరువూ తగ్గుతారు. దీన్ని చాలా తక్కువ మోతాదులో తీసుకున్నా కూడా పొట్ట నిండిన భావన కలగడమే అందుకు కారణం.ఇతర ఆహార పదార్థాలతో పోలిస్తే అవిసెగింజల్లో లిగ్నాన్లు 75 నుంచి 800 రెట్లు ఎక్కువగా ఉంటాయట. ఈ లిగ్నాన్లు ఆస్టియోపోరోసిస్‌ను నివారించి మెనోపాజ్ లక్షణాలనూ తగ్గిస్తాయని అంటారు. అదేవిధంగా రొమ్ము, ప్రొస్టేట్, కొలొన్, ఊపిరితిత్తులు.. తదితర క్యాన్సర్ కారకాలను నియంత్రించడంలో అవిసెగింజలు కీలకంగా పనిచేస్తాయి. అందుకే మెనోపాజ్ దశకు చేరుతున్న మహిళలు అవిసెగింజల్ని తరచూ తీసుకోవాలని సూచిస్తారు వైద్యులు.అవిసెగింజల్లోని పాలిఫెనాల్స్ కణాలకు రక్షణకవచాల్లా పనిచేసి...ఎన్నోరకాల అనారోగ్యాలను దరిచేరకుండా కాపాడతాయి. అలాగే వీటిల్లోని థయామిన్ మనం తీసుకునే ఇతర పోషకాలను శక్తిగా మార్చేందుకు తోడ్పడితే మెగ్నీషియం నాడీవ్యవస్థకూ, కండరాల వృద్ధికీ, రోగనిరోధకశక్తికీ ఉపయోగపడుతుంది. వీటిలో అధికంగా ఉండే ఇనుముతో ఎర్రరక్తకణాలూ వృద్ధి చెందుతాయి.

మొక్క జొన్న పీచుతో టీ

మొక్కజొన్న అంటే అందరికీ ఇష్టమే.ఈ కాలంలో విరివిగా దొరికే ఇవి రుచితోనే కాదు ఆరోగ్యంలోనూ ఎంతో ఉపయోగపడతాయి. మనకు తెలియని విషయం వాటిని ఒలిచిన తర్వాత వచ్చే పీచులో కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయట.మొక్కజొన్న పీచులో క్యాల్షియం, విటమిన్ బీ2, సీ, కేలు అధికంగా ఉంటాయి. ఈ పీచుతో టీ కాచుకుని కూడా తాగొచ్చు.కిడ్నీలను డిటాక్స్ చేసుంది.. మొక్కజొన్న పీచు మూత్రపిండాలకు దివ్యౌషధంలా పని చేస్తుంది. ఇది కిడ్నీలో ఉండే ప్రమాదకరమైన టాక్సిన్లు తొలగించి, రాళ్లు తొలగించడానికి ఉపయోగపడతాయి. మొక్కజొన్న పీచుతో తయారు చేసిన టీ తాగితే మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా నియంత్రించవచ్చు.యూరిన్ ఇన్‌ఫెక్షన్.. దీనిలో యాంటీఇన్‌ఫ్లెమేటరీ గుణాలు మెండుగా ఉంటాయి. ఇది మూత్రనాళంలో మంటను తగ్గిస్తుంది. అలాగే మూత్రంలో బ్యాక్టీరియాను నాశనం చేస్తుంది. శరీరంలోని విషపదార్థాలను బయటకు పంపి ప్రోస్టేట్ గ్రంధిని ఆరోగ్యంగా ఉంచుతుంది.షుగర్... మొక్కజొన్న పీచులో ఫైబర్, విటమిన్లు, మినరల్సు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల రక్తంలోని చక్కెర స్థాయిని పెరగనివ్వవు. అంతే కాదు రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రణలో ఉంచే ఇన్సులిన్ హార్మోన్‌ను నియంత్రించే గుణాలు దీనిలో మెండుగా ఉన్నాయి. మధుమేహం ఉన్నవారు రోజూ ఈ పీచుతో టీ కాచుకుని తాగితే చెక్కర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి.బరువుకు... దీనిలో ఉండే పీచు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. జీవక్రియను పెంచుతుంది. శరీరంలో ఉండే చెడుకొవ్వులను బయటకు పంపంచి బరువు తగ్గడానికి సహాయ పడుతుంది. అదనపు కొవ్వును కరిగిస్తుంది కూడా..

ఈ ఆహారంతో వృద్ధాప్య ఛాయలు దూరం..

ముఖంపై ముడతలతో త్వరగా కొందరిలో వృద్ధాప్యఛాయలు కనిపిస్తాయి. కొన్ని రకాల ఆహారాలను రోజూ తీసుకుంటే ఈ ప్రమాదానికి దూరంగా ఉండొచ్చంటున్నారు నిపుణులు.క్యాబేజీ.. ఏ,సీ,డీ విటమిన్లతోపాటు ఇండోల్-3-కార్బినోల్, యాంటీ ఆక్సిడెంట్స్ ఇందులో పుష్కలంగా ఉంటాయి. ఇవి యాంటీ ఏజింగ్ సమస్యను దరి చేరనివ్వవు. క్యాబేజీలోని బీటా కెరోటిన్ చర్మాన్ని ఆరోగ్యంగా మెరిపిస్తుంది.ద్రాక్ష.. వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు, ఆరోగ్యకరమైన కొవ్వు, పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ద్రాక్షను రోజూ తీసుకోండి. ఫ్రీరాడికల్స్‌తో పోరాడి చర్మకణాలను నిత్యం ఆరోగ్యంగా ఉండేలా చూస్తాయి. మెరుగైన రక్తప్రసరణకు తోడ్పడి చర్మానికి సాగే గుణాన్నిస్తాయి.టొమాటో.. సి విటమిన్, లైకోపిన్ సహా యాంటీఆక్సిడెంట్స్ ఇందులో నిండుగా ఉంటాయి. ఇవి ముఖంపై ముడతలు, గీతలను త్వరగా రానివ్వవు. ముఖచర్మాన్ని పొడారనివ్వకుండా ఆరోగ్యంగా, తేమగా ఉంచుతాయి. యాంటీ ఏజింగ్‌కు టొమాటో ఔషధంలా పనిచేస్తుంది.బ్లూబెర్రీ.. యాంటీ ఆక్సిడెంట్స్, సి, ఈ విటమిన్లు మెండుగా ఉండే ఈ పండ్లు ముఖచర్మానికి మృదుత్వాన్ని అందిస్తాయి. వాతావరణ కాలుష్యం, సూర్యరశ్మి నుంచి చర్మాన్ని సంరక్షించడమే కాకుండా, హైపర్ పిగ్మెంటేషన్ సమస్యను దరిచేరనివ్వవు. సాల్సిలిక్ యాసిడ్ సమృద్ధిగా ఉండి, చర్మంలోని మృతకణాలను బయటకు పంపుతుంది. ఈ పండ్లలోని సి విటమిన్, యాంతోసయానిన్ శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడి చర్మానికి సాగే గుణాన్ని అందిస్తుంది. వీటిలోనూ.. చేపలు, గుడ్లు, వెల్లుల్లి, సిట్రస్ ఫలాలను రోజూ ఆహారంలో తీసుకుంటే వీటిలో పుష్కలంగా ఉండే కొల్లాజెన్ గుణాన్నిస్తుంది. ఆకుకూరల్లో నీటిశాతం ఎక్కువగా ఉండటంతో ఇవి చర్మకణాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. తాజాగా మెరిసేలా చేసి ముందస్తు వృద్ధాప్యఛాయలను నిరోధిస్తాయి.

మరకలు పోగొట్టే పంచదార

ఆహారపదార్థాలకు తీపి తెచ్చే పంచదారంటే మెచ్చనిది ఎవరు? కానీ, దీన్ని ఆహారంలో ఎంత తక్కువ వాడితే అంత మంచిదంటారు వైద్యులు.మరి దీన్ని కొంచెం వినియోగిస్తే చాలు...మరెన్నో ప్రయోజనాలూ ఉన్నాయని మీకు తెలుసా? అవేంటంటే... పూలవాజుల్లో నీళ్లు మార్చిన ప్రతిసారీ ఆ నీళ్లలో పావుకప్పు పంచదార కూడా కలిపితే పూలు వాడిపోకుండా తాజాగా ఉంటాయి. బేక్ చేసిన బిస్కెట్లూ, పఫ్‌లు నిల్వ చేస్తుంటే ఆ డబ్బాలో ఓ చిన్నమూటలో పంచదారని వేసి పెట్టండి. పదార్థాలు నిల్వ వాసన రాకుండా ఉంటాయి. గడ్డిజాతి మొక్కల్ని(పోర్ట్యులాకా, లెమన్‌గ్రాస్, వీట్‌గ్రాస్)వంటివి పెంచేటప్పుడు మొదట్లో కొద్దిగా పంచదారని వేయండి. చక్కగా ఏపుగా ఎదుగుతాయి. దుస్తులపై పడ్డ ఆకు మరకలు పోవాలంటే గోరువెచ్చని నీళ్లలో పంచదారని కలిపి ఆ నీళ్లని మరకపై చిలకరించి పావుగంటపాటు వదిలేయాలి. కాసేపటికి సబ్బుతో ఉతికేస్తే మరక మాయమవుతుంది. చేతికంటిన మొండి గ్రీజు మరకలు పోవాలంటే... కొద్దిగా పంచదార చల్లుకుని తర్వాత సబ్బుతో కడిగేసుకుంటే సరి. సులువుగా వదులుతుంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News



హీరోగా హిట్ పడ్డా విలన్ వేషాలు ఎందుకు..!

పుష్ప సినిమాలో ఫహద్ పోషించిన పాత్రకు మంచి మార్కులు పడ్డాయి. పుష్ప 2 లో అంతకు మించి అన్నట్లుగా ఆయన పాత్ర ఉండబోతుంది అంటూ వార్తలు వస్తున్నాయి. మలయాళ స్టార్ నటులు పృథ్వీరాజ్ సుకుమారన్ మరియు ఫహద్ ఫాసిల్ లు ఒక వైపు హీరోలుగా సినిమాలు చేస్తూనే మరో వైపు విలన్ పాత్రల్లో మరియు క్యారెక్టర్ ఆర్టిస్టుగా కనిపిస్తూ పాన్ ఇండియా స్టార్ నటులుగా మంచి గుర్తింపు దక్కించుకుంటున్నారు. ఫహద్ ఫాసిల్ తాజాగా మరో సినిమాలో కీలక పాత్రలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. పుష్ప సినిమాలో ఫహద్ పోషించిన పాత్రకు మంచి మార్కులు పడ్డాయి. పుష్ప 2 లో అంతకు మించి అన్నట్లుగా ఆయన పాత్ర ఉండబోతుంది అంటూ వార్తలు వస్తున్నాయి. మరో వైపు సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న కూలీ సినిమాలో ఫహద్ నటించేందుకు ఓకే చెప్పాడని సమాచారం అందుతోంది. ఇప్పటికే రజినీకాంత్ తో కలిసి 'వెట్టాయన్' సినిమాలో నటిస్తున్న ఫహద్ ఇంకా ఆ సినిమా విడుదల కూడా అవ్వకుండానే కూలీ సినిమాలో నటించేందుకు ఓకే చెప్పాడని తమిళ సినీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. ఒక వైపు హీరోగా వరుసగా సినిమాలు చేస్తున్న ఫహద్ ఇలా ఇతర హీరోల సినిమాల్లో విలన్ వేషాలు వేయాల్సిన అవసరం ఏంటంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. ఆవేశం సినిమాతో ఏకంగా వంద కోట్ల వసూళ్లను దక్కించుకున్న ఫహద్ హీరోగా కెరీర్ బెస్ట్ హిట్ ను సొంతం చేసుకున్నాడు. అయినా కూడా తన విలన్ వేషాలు మరియు ముఖ్య పాత్రల్లో నటించడం మాత్రం మానుకోవడం లేదు. హీరోగా కంటే కూడా ఎక్కువగా నటుడిగా తనను తాను నిరూపించుకునేందుకు ఫహద్ ప్రయత్నిస్తున్నాడు. మలయాళంతో పాటు అన్ని భాషల సినిమాల్లో కూడా హీరోగానే కాకుండా మంచి పాత్రతో వస్తే ఎలాంటి పాత్రలో రెడీ ఫహద్ గతంలో పలు ఇంటర్వ్యూల్లో చెప్పుకొచ్చాడు. అన్నట్లుగానే వరుసగా ఇలా క్యారెక్టర్ ఆర్టిస్టుగా సినిమాలను చేస్తూ వస్తున్నాడు.

విజయ్ - రష్మిక... మరో ట్విస్ట్ ఇస్తారా?

ఒకప్పుడు హీరో హీరోయిన్ కాంబినేషన్ అంటే బాక్సాఫీస్ వద్ద భారీ స్థాయిలో కలెక్షన్స్ అందుకునేవి. వారి కలయిక కోసమే ఓ వర్గం ఆడియన్స్ థియేటర్లోకి భారీ సంఖ్యలోనే వచ్చేవారు. అయితే ఇప్పుడు మాత్రం ఆ కాంబినేషన్ తీరు మొత్తం మారిపోయింది. మరోసారి వెండితెరపై హీరో హీరోయిన్ కెమిస్ట్రీని చూడడానికి ఆడియన్స్ పెద్దగా ఇష్టపడడం లేదు.కేవలం కొన్ని కాంబినేషన్స్ మాత్రమే బాక్స్ ఆఫీస్ వద్ద సక్సెస్ అవుతున్నాయి. అది కూడా కంటెంట్ బాగుంటేనే ఆడియన్స్ వస్తున్నారు. కాంబినేషన్స్ చూసి అయితే ఈసారి అసలు ఇష్టపడడం లేదు. ఇక విజయ్ దేవరకొండ రష్మిక మందన్న కాంబినేషన్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇద్దరి మధ్యలో ప్రేమ కొనసాగుతున్నట్లు గతంలోనే చాలాసార్లు అనేకరకాల కథనాలు వచ్చాయి.గీతగోవిందం బాక్సాఫీస్ వద్ద భారీ స్థాయిలో విజయాన్ని అందుకోవడంతో ఆ తర్వాత మళ్లీ వీరి కలయికలోనే డియర్ కామ్రేడ్ అనే సినిమా వచ్చింది. కానీ ఆ సినిమా అంచనాలను అందుకోలేకపోయింది. అయినప్పటికీ కూడా వీరికి సంబంధించిన వార్తలు ఒక రేంజ్ లోనే వైరల్ అవుతున్నాయి. అయితే మూడోసారి కూడా ఈ కాంబినేషన్ వెండితెర పైకి వచ్చే అవకాశం ఉన్నట్లుగా కొత్త కథనాలు వినిపిస్తున్నాయి.అది కూడా మళ్ళీ గీతగోవిందం కాంబినేషన్ తరహా లోనే ఉండబోతున్నట్లుగా తెలుస్తోంది. విజయ్ దేవరకొండ వరుసగా బాక్సాఫీస్ సక్సెస్ లు అందుకుంటున్న తరుణంలో గీతగోవిందం సినిమా అతని మార్కెట్ ను మరో రేంజ్ కు తీసుకు వెళ్ళింది. దర్శకుడు పరుశురాం కూడా ఆ తర్వాత స్టార్ దర్శకుల్లో ఒకరిగా క్రేజ్ అందుకున్నాడు.కానీ మహేష్ బాబు ఇచ్చిన ఛాన్స్ మాత్రం అతను వాడుకోలేకపోయాడు. ఇక ఇప్పుడు మిగతా హీరోలు బిజీగా ఉండిపోవడం వల్ల చివరికి మళ్ళీ అతను విజయ్ దేవరకొండ వైపే మొగ్గు చూపుతున్నాడు. అయితే వారి కలయికలు వచ్చే సినిమా కోసం రష్మిక మందన్నాను హీరోయిన్ గా సెలెక్ట్ చేసుకోవాలని ఆలోచనలో ఉన్నట్లుగా తెలుస్తోంది. మరి ఇది ఎంతవరకు నిజమో తెలియాలి అంటే మరి కొన్ని రోజులు ఆగాల్సిందే.

రాజమౌళి అంతే మొత్తం మార్చేస్తాడు..!

ఒక సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే వరకు డైరెక్టర్ పడే తపన ఏంటన్నది అందరికీ తెలిసిందే ఒక సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే వరకు డైరెక్టర్ పడే తపన ఏంటన్నది అందరికీ తెలిసిందే. అందుకే వరుస హిట్లతో సెన్సేషన్ సృష్టిస్తున్న రాజమౌళి లాంటి డైరెక్టర్ గురించి అయితే ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. రాజమౌళి సినిమా అంటే ఆయన చివర్లో వేసే రాజ ముద్ర లానే సూపర్ హిట్ పక్కా అనే ఆడియన్స్ కూడా ఫిక్స్ అయ్యారు. ఐతే ఆ మార్క్ సెట్ చేయడం కోసం ఆయన చేసే కృషి అంతా ఇంతా కాదు. బాహుబలి సినిమాతో తెలుగు సినిమా రూపురేఖలు మార్చేసిన దర్శకుడు రాజమౌళి. జూలై 10 2015 సరిగ్గా 9 ఏళ్ల క్రితం బాహుబలి మొదటి భాగం రిలీజైంది. ఈ సినిమా తెలుగు సినిమా తల రాతను మార్చేసింది. ప్రభాస్ ని పాన్ ఇండియా స్టార్ ని చేసింది. ఒక కథను రెండు ముక్కలుగా చెప్పొచ్చు అనే విషయాన్ని చెప్పింది. ఒక్కటేంటి రాజమౌళి బాహుబలి తీశాడు మనం ఎందుకు తీయలేం అని ప్రతి దర్శకుడు తాను కన్న కలని నిజం చేసుకునేందుకు నడుం బిగించి ముందుకు నడిచే స్ఫూర్తిని ఇచ్చాడు. 9 ఏళ్ల బాహుబలి బిగినింగ్ సినిమా గురించి ఇప్పటివరకు ఆడియన్స్ కు తెలియని ఒక విషయం బయటకు వచ్చింది. అదేంటి అంటే బాహుబలి 1 ఇంటర్వల్ లో విగ్రహం పైకెత్తుతూ అక్కడ ప్రజలు బాహుబలిని చూస్తారు. అందరు బాహుబలి బాహుబలి అంటూ హుశారెత్తించేలా చెబుతారు. అదే బాహుబలి 1 ఇంటర్వెల్ అవుతుంది. ఐతే రాజమౌళి ముందు అలా కాకుండా దేవసేన డైలాగ్ తో మాహిష్మతి ఊపిరి పీల్చుకో.. నా కొడుకు వచ్చాడు.. బాహుబలి తిరిగి వచ్చాడు అనే సీన్ తో శివుడు పంచభూతాలు అంటే గాలి, నీరు, నిప్పు, భూమి, ఆకాశం దాటుకుంటూ వస్తాడు దీన్ని ఇంటర్వెల్ గా చేద్దామని అనుకున్నారట. ఇప్పటికైనా ఒప్పుకున్నారు ఇదే కాదు శివుడు మాహిష్మతికి వచ్చే టైంలో సైనికులతో ఫైట్ చేస్తాడు అక్కడ ఒకతను బాహుబలిని గుర్తు పట్టి వచ్చి బిజ్జలదేవాకి చెబుతాడు. అప్పుడు బిజ్జలదేవా వాడి ప్రాణాలు పంచభూతాల సాక్షిగా మట్టిలో కలిపేశాం అని చెప్పగా ఒక్కొక్కటి దాటుకుంటూ శివుడు వస్తాడు. ఈ సీన్ కి ఆల్రెడీ షూట్ జరగగా బిజ్జల దేవా డైలాగ్స్ అన్ని కట్ చేసినట్టు తెలుస్తుంది. మొత్తానికి అలా బాహుబలి 1 ఇంటర్వల్ కోసం రాజమౌళి అలా ప్లాన్ చేశారు. ఇక పార్ట్ 1 మీద ఉన్న అంచనాలను ఏమాత్రం తగ్గకుండా బాహుబలి 2 వచ్చింది. ఆ సినిమా కూడా నెవర్ బిఫోర్ రికార్డులను కొల్లగొట్టింది. బాహుబలి 1, 2 సినిమాలు సృష్టించిన రికార్డులు ఇప్పటివరకు ఏ సినిమా బ్రేక్ చేయలేదు.

లేటు వయసులో మరీ ఇంత ఘాటుగానా

సౌత్‌లో స్టార్ హీరోయిన్ గా సుదీర్ఘ కాలం కొనసాగిన అందాల భామ శ్రియ శరన్. ఈ అమ్మడు రెండు దశాబ్దాల సినీ కెరియర్ ని పూర్తి చేసుకుంది. ఈ 20 ఏళ్ళలో కమర్షియల్ సినిమాలతో పాటు కంటెంట్ బేస్ మూవీఆలో కూడా నటించింది. అలాగే యంగ్ హీరోల నుంచి స్టార్ హీరోల అందరి జోడీగా ఆడిపాడింది. దీంతో శ్రియ శరన్ కి సౌత్ లో భారీ సక్సెస్ లు ఉన్నాయని చెప్పాలి. ఇదిలా ఉంటే ప్రస్తుతం రష్యన్ బ్యాడ్మింటన్ ఆటగాడిని ప్రేమించి పెళ్లి చేసుకున్న అమ్మడు అక్కడే సెటిల్ అయ్యింది.ఆ మధ్య ఒక కూతురు కూడా పుట్టింది. మరల ఈ మధ్య నటిగా శ్రియ బిజీ అయ్యే ప్రయత్నం చేస్తుంది. ఇప్పటికే హిందీ దృశ్యం 2 రీమేక్ లో నటించి సక్సెస్ కొట్టింది. ఇదిలా ఉంటే ఇప్పుడు ఉపేంద్ర కబ్జా మూవీలో శ్రియ శరన్ నటిస్తుంది. ఈ మూవీ పాన్ ఇండియా రేంజ్ లో రిలీజ్ అవుతుంది. దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ మూవీ ప్రమోషన్ లో శ్రియ శరన్ బిజీగా ఉంది. ఇదిలా ఉంటే శ్రియ శరన్ ప్రస్తుతం 40 ఏళు ్ళ దాటిపోయింది.ఈ వయస్సులో కూడా ఈ బ్యూటీ ఏ మాత్రం వన్నె తగ్గని అందాలతో మెరిసిపోతుంది. అదే సమయంలో రెగ్యులర్ గా హాట్ ఫోటో షూట్ లు చేస్తూ సందడి చేస్తుంది. సోషల్ మీడియాలో ఈ బ్యూటీ ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. తాజాగా ఈ అమ్మడు బ్లాక్ కలర్ అంబ్రాయిడరీ టాప్ వేసింది. అందులో ఎద అందాలు బయటకి నిండుగా కనిపిస్తున్నాయి.అలాగే దానికి దోటీ స్టైల్ లో ఉన్న స్కర్ట్ వేసింది అందులో నీటిలో తడిసిన థైస్ సొగసులు చూపిస్తుంది. ఈ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. లేటు వయస్సులో కూడా ఈ స్థాయిలో ఘాటు అందాలతో రెచ్చిపోతూ ఉంటే కుర్రాళ్ళకి నిద్ర కరువైపోతుంది అంటూ నెటిజన్లు ఆ ఫోటోలపై కామెంట్స్ చేస్తూ ఉండటం విశేషం.

టాప్ హీరోయిన్ల టాటూ స్టోరీస్

టాటూ ట్రెండ్ ఈనాటిది కాదు. దశాబ్ధాలుగా పచ్చబొట్ల సంస్కృతితో భారతీయులకు పరిచయం ఉంది టాటూ ట్రెండ్ ఈనాటిది కాదు. దశా బ్ధాలుగా పచ్చబొట్ల సంస్కృతితో భారతీయులకు పరిచయం ఉంది. అయితే సెలబ్రిటీల వల్ల ఈ సంస్కృతికి అద్భుత ప్రచారం దక్కుతోంది. ఇటీవలి కాలంలో పాపులర్ కథానా యికలు ప్రత్యేకించి టాటూ (పచ్చబొట్లు) పై ఎంతో మోజు చూపిస్తున్నారు. నేటితరం నటీమణులు రెగ్యులర్ గా తమ టాటూలను ప్రదర్శిస్తుంటే, నాటి మేటి తరం కూడా టాటూలతో హాట్ టాపిగ్గా మారుతున్నారు. ఇటీవల కథానాయికల ఫ్యాషన్ సెన్స్ అలవాట్లపై నిరంతరం ఆన్ లైన్ లో చర్చ సాగుతోంది. ప్రస్తుతం ట్రెండీ టాటూ కల్చర్ పైనా ఆన్ లైన్ లో డిబేట్ నడుస్తోంది. టాలీవుడ్ అగ్ర కథానాయిక సమంత తన నడుపు పై భాగంలో టాటూ వేయించుకుని చాలా కాలం పాటు మెరుపులు మెరిపించింది. వైఎంసి అని టాటూ వేయించుకుంది. ఏమాయ చేశావేకు ఇది షార్ట్ ఫామ్. బుల్లితెర యాంకర్ అనసూయ ఎక్కువగా ఫోటో షూట్లలో టాటూని హైలైట్ చేస్తుంది. తన మెడకి బాగా కింద వైపు టాటూ వేయించుకుని యువతరాన్ని ఆకర్షిస్తుంది. రష్మిక మందన్నా తన కుడిచేతిపై టాటూతో ముచ్చట పడుతోంది. సీనియర్ బ్యూటీ త్రిషకు ఈ టాటూల పిచ్చి మరీ ఎక్కువ. ఈ బ్యూటీ తన చేతి మీదనే కాదు వీ షేప్ వద్దా టాటూ వేయించుకుని .. టాటూలపై తన మనసును చాటుకుంది. కమల్ హాసన్ గారాలపట్టి శ్రుతిహాసన్ వెస్ట్రన్ స్టైల్ ని ఇష్టపడుతుంది. గోథిక్ మేకప్ తో పాటు టాటూలపై తనకు ఎంత మమకారం ఉందో నిరూపించింది. తన వీపు.. మెడ భాగాల్లో టాటూలు వేయింకుని మరీ ఈ అమ్మడు మురిసిపోతోంది. నయనతార- ప్రియమణి- తాప్సి- ఇలియానా- చార్మి టాటూలతో కుర్రకారు మనసులో గిలిగింతలు పెట్టిన వారి జాబితాలో ఉన్నారు.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986